




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 240, పేజీలు - 08

ఆదివారం, ఫిబ్రవరి 15, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## ఎక్స్ అఫీషియో ఓటుపై ఎస్ఈసీ స్పష్టత

### - వారికి ఎక్స్ అఫీషియో ఓటు లేనట్లేనా.?







హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు పూర్తైన సంగతి తెలిసిందే. పోలింగ్ పూర్తై రిజల్ట్స్ సైతం విడుదల అయ్యాయి.అయితే మున్సిపల్ చైర్మన్..వైస్ చైర్మన్, కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు జరగాల్సి ఉంది. మున్సిపల్ చైర్మన్, కార్పొరేషన్ మేయర్ల ఎన్నికలో అత్యంత కీలకమైన ఎక్స్ అఫీషియో ఓట్లపై ఈసీ బాంబు పేల్చింది.ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఉండే ఎక్స్అఫీషియో అధికారానికి సంబంధించి ఎన్నికల సంఘం స్పష్టమైన నిబంధనలను విడుదల చేసింది.హైకోర్టు తీర్పు మేరకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ కొత్త మార్గదర్శకాల ప్రకారం ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యులకు మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటు హక్కు వేసే అవకాశం లేదని తేల్చి చెప్పింది. వారికి ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు వేసే అవకాశం లేనట్లే అని ఈసీ పేర్కొంది. ఈ ఎక్స్ అఫీషియో ఓటు నమోదుకు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి నేటితో (గడువు తేదీ) సమయం ముగుస్తుంది అని తెలంగాణ ఎన్నికల కమిషన్ వెల్లడించింది.

**-ఎక్స్ ఆఫీషియో ఓటుపై ఈసీ కీలక ఆదేశాలు**

మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్,కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు తీర్పు మేరకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఎక్స్ ఆఫిషియో సభ్యుల అర్హతలపై ఎన్నికల కమిషన్ క్లారిటీ ఇచ్చింది. మున్సిపల్ ప్రాంతంలో ఓటర్‌గా రిజిస్టర్ అయితేనే అర్హత అని పేర్కొంది. లోక్‌సభ ఎంపీ, ఎమ్మెల్యేలకు ప్రత్యేక నిబంధనలు కల్పించింది. అయితే రాజ్యసభ(ఎంపీ),ఎమ్మెల్సీకి కూడా ఓటర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. అర్హతలేని సభ్యులకు ఓటు హక్కు ఉండదు అని ఈసీ పేర్కొంది. అర్హత లేకుండా వేసిన ఓటు చెల్లదు అని ఎన్నికల కమిషన్ హెచ్చరించింది. అర్హత లేని వ్యక్తిని సభ్యుడిగా పరిగణించరు అని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లకు సర్క్యులర్ పంపిణీ చేసింది.

2లో..

### ప్రపంచాన్ని ఇక నడిపించబోయేది

## భారతదేశమే

### - గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో ప్రధాని మోడీ




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నూతన ప్రపంచ వ్యవస్థ వైపు ప్రపంచం పరుగులుతీస్తున్న వేళ భారతదేశం ప్రపంచ అభివృద్ధికి ఇంజిన్ గా మారబోతుందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. న్యూఢిల్లీలో జరుగుతున్న ఈటీ నౌ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ 2026కు ప్రధాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి టైమ్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వినీత్ జైన్ స్వాగతం పలికారు. ఈ వేదికపై నుంచి ప్రధాని మోదీ మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఒక కొత్త ప్రపంచ వ్యవస్థ ఏర్పడిందని చెప్పారు. అయితే ఏడు దశాబ్దాల తర్వాత ఆ వ్యవస్థ విచ్ఛిన్నమవుతోందని ప్రపంచం నేడు మరో కొత్త వ్యవస్థ వైపు పయనిస్తోందని అన్నారు. ప్రపంచం నేడు మాట్లాడుతున్న “శతాబ్దపు పరివర్తన”కు భారతదేశం బలమైన పునాది వేయడానికి సిద్ధంగా ఉందని, రాబోయే సంవత్సరాల్లో, భారతదేశం ప్రపంచ అభివృద్ధికి ఇంజిన్‌గా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గత దశాబ్ద కాలంలో సాంకేతికత, ఆవిష్కరణలను అభివృద్ధికి కీలక స్తంభాలుగా పరిగణించామని ప్రధాని మోదీ తెలిపారు. ఈ దార్శనికతతోనే దేశంలో స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను పెంపొందించామని నేడు భారతదేశంలో 2,00,000 కంటే ఎక్కువ నమోదిత స్టార్టప్‌లు ఉన్నాయని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు భారతదేశం కొత్త ఇంజిన్‌గా ఉద్భవిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం భారతదేశం ప్రపంచ వృద్ధికి తన వంతు సహకారం అందిస్తోందని చెప్పారు.

2లో..

### అనుకున్నన్ని సీట్లు రాలేదని

## కాంగ్రెస్‌లోనే అసంతృప్తి

### - కేటీఆర్ చిట్ చాట్

- మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు
- 30కి పైగా మున్సిపాలిటీలు వస్తాయని అనుకున్నామన్న కేటీఆర్
- హంగ్ వచ్చిన ప్రాంతాల్లో పరిస్థితి తమకు అనుకూలంగా ఉందని వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తిని నింపాయని వారు ఆశించిన స్థాయిలో స్థానాలు సాధించలేకపోయారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్న పార్టీకి సాధారణంగా ఉండే సానుకూలతను వాడుకుని విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసినా కాంగ్రెస్‌కు పూర్తి విజయం దక్కలేదని ఎద్దేవా చేశారు. మీడియా ప్రతినిధులతో కేటీఆర్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తమ పార్టీ కార్యకర్తలు గట్టిగా పోరాడటం వల్లే 17 మున్సిపాలిటీల్లో విజయం సాధించామని హంగ్ ఏర్పడిన చోట్ల కూడా తమకే అవకాశాలు ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు.

2లో..

### కుట్రలు చేస్తే.. మీ అందరినీ రాజకీయ సమాధి చేస్తా

### - కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీదే అన్న బండి సంజయ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మూడు పార్టీలు ఒకటేనని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఆ మూడు పార్టీలకు ప్రేమికుల రోజు శుభాకాంక్షలు అని వ్యంగ్యంగా అన్నారు. కరీంనగర్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఎక్కువ స్థానాలు వచ్చినప్పటికీ మేయర్ పీఠం దక్కించుకుంటామని కాంగ్రెస్, బీఆర్ఎస్ చెబుతున్నాయని

2లో..

## రూ. 3.32 లక్షల కోట్లతో ఏపీ బడ్జెట్

### - రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంతో బడ్జెట్ రూపొందించామన్న పయ్యావుల

- రెవెన్యూ వ్యయం రూ.2,56,143 కోట్లు
- అమరావతి నిర్మాణానికి రూ. 6 వేల కోట్లు
- విశాఖ ఆర్థిక ప్రాంతానికి రూ 28 వేల కోట్లు
- రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు రూ. 30 వేల కోట్లు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ ప్రభుత్వం భారీ అంచనాలతో 2026-27 వార్షిక బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో గత ప్రభుత్వం లో సాగిన పాలన పైన విమర్శలు చేసారు. రాష్ట్ర విభజన ఒక నష్టం అయితే ఆ తరువాత అయిదేళ్ల పాలన రాష్ట్రానికి నష్టం చేసిందని ఆరోపించారు. ఈ బడ్జెట్ కేవలం పద్దులే కాదని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందని వెల్లడించారు. అభివృద్ధి- సంక్షేమంతో రాష్ట్రాన్ని పరుగులు పెట్టించాలనేదే తమ విధానమని స్పష్టం చేసారు.రాష్ట్ర బడ్జెట్ 2026-27 ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి రూ 3,32,205 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం తో ఈ బడ్జెట్ ప్రతిపాదించినట్లు వెల్లడించారు. రాయలసీమ రైతుల కలలను సాకారం చేసేలా ప్రాధాన్యత ఇచ్చామన్నారు. పెట్టుబడి దారులకు అనుకూల వాతావరణం కల్పించామని ఆర్థిక మంత్రి వివరించారు. కీలక రంగాలకు కేటాయింపులు భారీగా పెంచారు. రెవెన్యూ వ్యయం రూ. 2,56,143 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ. 53,915 కోట్లు గా పేర్కొన్నారు. రెవెన్యూ లోటు రూ. 22,002 కోట్లు..ద్రవ్య లోటు రూ. 75,868 కోట్లు గా అంచనాల్లో వెల్లడించారు. ఇక, శాఖల వారీగా వ్యవసాయ శాఖ కు రూ 11,745 కోట్లు, పాఠశాల విద్య కు రూ 32, 208, బీసీ సంక్షేమం రూ 23650 కోట్లు, ఇంధన శాఖ- 19,306 కోట్లు, పంచాయితీ రాజ్ కు రూ 22,941 కోట్లు, ఇరిగేషన్ 18,223 కోట్ల మేర కేటాయింపులు ప్రతిపాదించారు. అన్నదాత సుఖీభవ కోసం రూ 6,600 కోట్లు, మత్స్యకార సేవకు 600 కోట్లు, ధరల స్థిరీకరణ కు రూ 560 కోట్లు కేటాయింపులు చేసారు.

2లో..

### బంగ్లా ప్రధానిగా తారిక్ రెహమాన్

### - 'డార్క్ ప్రిన్స్'కు సవాళ్ల స్వాగతం



ఢాకా (ప్రశ్న న్యూస్)బంగ్లాదేశ్‌లో ఇటీవలి ఎన్నికల ఫలితాలు రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేశాయి.

2లో..

## 360 డిగ్రీస్ గ్రోత్ మోడల్

### -బడ్జెట్ 2026-27పై పవన్ కల్యాణ్ స్పందన



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశంసలు కురిపించారు. రూ.3,32,205 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ బడ్జెట్, రాష్ట్రాన్ని 360 డిగ్రీల కోణంలో సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు బలమైన పునాది వేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న 'వికసిత్ భారత్ 2047'లో ఏపీని కీలక భాగస్వామిని చేస్తుందని, 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాన్ని చేరుకునేలా నడిపిస్తుందని పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బడ్జెట్ ఒక సమతుల్య గ్రోత్ మోడల్‌గా రూపుదిద్దుకుందని పవన్ కల్యాణ్ కొనియాడారు.

2లో..

### ఇది ట్రైలర్ మాత్రమే..

## అసలు సినిమా ముందుంది

### - బీఆర్ఎస్ పార్టీకి కవిత హెచ్చరిక

- తాము రాజకీయ పార్టీగా మారబోతున్నట్లు తెలియగానే బీఆర్ఎస్ ట్రోలింగ్ చేసింది
- బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికైనా తప్పులను సరిదిద్దుకోవాలని కవిత సూచన
- వడ్డేపల్లిలో ఏఐఎఫ్‌బీ, తెలంగాణ జాగృతి కలిసి విజయం సాధించిందన్న కవిత



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తమ సంస్థ రాజకీయ పార్టీగా మారబోతుందని ప్రకటించగానే బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు తమను ట్రోలింగ్ చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. కానీ తమను లక్ష్యంగా చేసుకున్న వారికి ఒకటే విషయం చెబుతున్నానని, ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని హెచ్చరించారు. ఇప్పుడే తొందరపడి మాట జారవద్దని, తమపై కారుకూతలు కూయవద్దని బీఆర్ఎస్ వారిని హెచ్చరించారు. ఇప్పటికైనా మీ తప్పులను సరిదిద్దుకోవాలని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వారు ఉద్యమకారులను

2లో..

## ఏపీ అసెంబ్లీలో ఆధ్యాత్మిక శోభ

### - ఒకే రకమైన చీరల్లో కూటమి మహిళా ప్రజాప్రతినిధులు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రేపటి మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని, కూటమి ప్రభుత్వానికి

2లో..

## హంగ్ మున్సిపాలిటీలపై కాంగ్రెస్ కన్ను

- మేయర్ పీఠమే లక్ష్యం
- పొత్తులు, మద్దతుపై చర్చ
- మంత్రులకు సీఎం దిశానిర్దేశం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పురపోరులో సత్తాచాటిన కాంగ్రెస్ పార్టీ హంగ్ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు హస్తగతం చేసుకునేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలోనే మంత్రులు, సీనియర్ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించారని మంత్రులను సీఎం ప్రశంసించారు.

2లో..

## ఇక ఆధార్ కార్డుకు కొత్త రూపు

### - రూపురేఖలు మార్చేందుకు యూఐడీఏఐ సన్నాహాలు




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా కోట్లాది మంది గుర్తింపు కార్డుగా మారిన ఆధార్ కార్డు స్వరూపంలో భారీ మార్పులు రాబోతున్నాయి. ఆధార్ కార్డు ఫోటోకాపీల ద్వారా జరుగుతున్న మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఈ కీలక మార్పులను ప్రతిపాదించింది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, భౌతిక ఆధార్ కార్డుపై ఇకపై వ్యక్తిగత వివరాలు కనిపించవు. ప్రస్తుతం మనం బ్యాంకు ఖాతా తెరిచేందుకు, సిమ్ కార్డు కొనుగోలు చేసేందుకు,

2లో..

# ఎక్స్ అఫీషియో ఓటుపై ఎస్ఈసీ స్పష్టత

### - స్థానికంగా ఓటు కలిగి ఉండాలి

ఇకపోతే గతంలో రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు రాష్ట్రంలోని తమకు నచ్చిన మున్సిపాలిటీని ఎంచుకుని ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు వేసే అవకాశం ఉండేది. ఈ అంశంపై హైకోర్టులో కేసు నడుస్తోంది. అయితే దీనిని విచారించిన న్యాయస్థానం స్థానిక ఓటు లేకుండా ఇతర ప్రాంతాల్లో ఓటు వేయడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలోనే ఎస్ఈసీ తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. ఎంపీలు, ఎమ్మెల్సీలు ఏ మున్సిపాలిటీలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఉండాలనుకుంటున్నారో, అక్కడ వారి పేరు ఓటరు జాబితాలో ఉండాలి. ఒకవేళ మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కాకపోతే, వారు ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొనసాగడానికి అనర్హులు.

నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేకుండా వేసే ఓట్లు ఏవైనా ఉంటే అవి చెల్లవని ఎస్ఈసీ స్పష్టంగా పేర్కొంది. తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం–2019 ప్రకారం ఈ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఈసీ ఆదేశించింది.

### - హంగ్ ఏర్పడిన ప్రాంతాలలో ఇబ్బందులు

మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు విడుదలైన నేపథ్యంలో మేయర్, చైర్మన్ పీఠాలను దక్కించుకోవడం రాజకీయ పార్టీలకు అత్యంత కలకంగా మారింది. ముఖ్యంగా హంగ్ ఏర్పడిన చోట ఈ ఓట్లే గెలుపోటములను డిసైడ్ చేస్తాయి. తాజా ఎస్ఈసీ నిబంధనలతో స్థానిక ఓటు లేని ప్రజాప్రతినిధులు తమ ఓటును వినియోగించుకోలేరు. దీంతో హంగ్ ఏర్పడిన ప్రాంతాల్లో మున్సిపల్ చైర్మన్, మేయర్ పీఠాల సమీకరణాలు మారే అవకాశం ఉంది. హైకోర్టు సీరియస్‌గా ఉండటంతో, అధికారులు ఈ నిబంధనల అమలులో ఏమాత్రం అలసత్వం వహించినా చర్యలు తప్పవని రాష్ట్ర ఎన్నికల సంఘం హెచ్చరించింది.

# ప్రపంచాన్ని ఇక నడిపించబోయేది భారతదేశమే

రాబోయే సంవత్సరాలలో భారతదేశ సహకారం నిరంతరం పెరుగుతుందని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.గత దశాబ్ద కాలంలో అనేక అవరోధాలు ఎదురైనప్పటికి భారత్ అత్యుత్తమ అభివృద్ధిని సాధించిందని చెప్పారు. అలాగే, భారతదేశం అనేక సవాళ్లను అధిగమించిందని 11వ స్థానం నుంచి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ప్రధాని మోదీ గుర్తుచేశారు.గత దశాబ్దం తీవ్ర గందరగోళంతో నిండిపోయిందని అన్నారు. “ప్రపంచం చాలా సవాళ్లను ఎదుర్కొంది. కరోనా మహమ్మారి, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, సప్లై చైన్‌ల అంతరాయాలు వంటి తీవ్రమైన సవాళ్లను కూడా ప్రపంచం చూసింది. సంక్షోభ సమయాల్లో ఏ దేశానికైనా నిజమైన బలం, సామర్థ్యం బయటపడుతుందని చెబుతారు.

ప్రపంచ అంతరాయాలు ఉన్నప్పటికీ, భారతదేశం తనను తాను నిరూపించుకుంది. అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఈ దశాబ్దం భారతదేశానికి వృద్ధి, అద్భుతమైన డెలివరీ, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిందని చెప్పడానికి నేను చాలా గర్వపడుతున్నాను” అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అదే సమయంలో గత ప్రభుత్వాలు సంస్కరణలను బలవంతంగా అమలు చేశాయని కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని మోదీ విమర్శలు గుప్పించారు.దేశం దివాలా ముప్పును ఎదుర్కొంటున్నప్పుడు 1991 సంస్కరణలను అమలు చేశారని ఆయన చెప్పారు. భారతదేశం తన బంగారాన్ని తనఖా పెట్టాల్సి వచ్చిందని అన్నారు. అటువంటి సంక్షోభం తర్వాతే ప్రధాన ఆర్థిక నిర్ణయాలు తీసుకున్నారని మండిపడ్డారు. ఈ విధానం ఒక ఆర్థిక వ్యవస్థకే పరిమితం కాలేదని మోదీ విమర్శలు గుప్పించారు. 26/11 ముంబై ఉగ్రవాద దాడులను ప్రస్తావిస్తూ ఆ సంఘటన తర్వాతే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)ను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని గ్రహించిందని అన్నారు. గతంలో తీవ్రమైన సంక్షోభం తలెత్తే వరకు నిర్దిష్ట సంస్థాగత సంస్కరణలు అమలు చేయలేదని విమర్శించారు. అలాగే విద్యుత్ రంగం ఉదాహరణను కూడా మోదీ ప్రస్తావించారు. విద్యుత్ రంగం తీవ్ర సవాళ్లను ఎదుర్కొన్నప్పుడు, గ్రిడ్‌లు విఫలమవడం ప్రారంభించినప్పుడు, వ్యవస్థ కుప్పకూలినప్పుడు మాత్రమే సంస్కరణల గురించి చర్చించారని విమర్శలు గుప్పించారు.

సంస్కరణలను బలవంతంగా అమలు చేసినప్పుడు వాటి ఫలితాలు ప్రభావవంతంగా ఉండవని, దేశానికి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించవని మోదీ పేర్కొన్నారు. అందుకే గత 11 సంవత్సరాలుగా తాము దృఢ నిశ్చయంతో సంస్కరణలను అమలు చేశామని చెప్పడానికి తాను గర్విస్తున్నానని ప్రధాని మోదీ అన్నారు. విధానాలు మారినప్పటికీ మనస్తత్వం అలాగే ఉంటే, ఖచ్చితంగా అమలు జరగకపోతే సంస్కరణలు కేవలం కాగితపు ముక్కలుగా మారుతాయని ఆయన అన్నారు. అందువల్ల మొత్తం వ్యవస్థను మార్చడానికి మేము నిజాయితీగా కృషి చేశామని చెప్పారు.

# అనుకున్నన్ని సీట్లు రాలేదని
# కాంగ్రెస్‌లోనే అసంతృప్తి

గతంలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేవలం నాలుగు స్థానాలకే పరిమితమైందని గుర్తు చేస్తూ ఇప్పుడు తమ ప్రదర్శన చాలా మెరుగ్గా ఉందని విశ్లేషించారు.

### - బీజేపీ హడావిడి ఎక్కువ.. ఫలితాలు తక్కువ

బీజేపీ ప్రదర్శనపై కూడా కేటీఆర్ ఘాటు విమర్శలు చేశారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు వచ్చి ప్రచారం చేసినా హడావిడి చేసినా ఒక్క మున్సిపాలిటీని కూడా గెలవలేకపోయారని విమర్శించారు. గతంతో పోలిస్తే బీజేపీకి ఓట్లు, వార్డులు తగ్గాయని కేవలం గొప్పలు చెప్పుకోవడానికే ఆ పార్టీ పరిమితమైందని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అధినేతల పర్యటనల కంటే స్థానిక అంశాలే కీలకంగా ఉంటాయని.. ప్రభుత్వ అధికార దుర్వినియోగాన్ని ఎదిరించి తమ పార్టీ అద్భుతంగా నిలబడిందని కొనియాడారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత తమ పార్టీని తక్కువ అంచనా వేసిన వారికి ఈ ఫలితాలే సరైన సమాధానమని స్పష్టం చేశారు.

### - ఎక్స్ అఫీషియో నిబంధనలపై అయోమయం

ఎన్నికల తర్వాత మేయర్ మరియు చైర్మన్ ఎన్నికల్లో కీలకమైన ఎక్స్ అఫీషియో సభ్యుల నిబంధనలపై ప్రభుత్వానికి కనీస అవగాహన లేదని కేటీఆర్ విమర్శించారు. కలెక్టర్లు ఒక మాట చీఫ్ సెక్రటరీ మరో మాట చెబుతూ గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నిబంధనల విషయంలో స్పష్టత లేకపోవడం వల్ల ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని ధ్వజమెత్తారు. మేయర్ పీఠాలను దక్కించుకోవడానికి ప్రభుత్వం అడ్డదారులు తొక్కే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు.

### - ఫార్ములా-ఈ విచారణ ఒక తమాషా

ప్రభుత్వం మరోసారి ఫార్ములా–ఈ అంశాన్ని తెరపైకి తేవడం కేవలం కాలక్షేపం కోసమేనని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే నాలుగుసార్లు విచారణకు పిలిచి ఏమీ నిరూపించలేకపోయారని ఇప్పుడు మళ్ళీ పిలవడం తమాషాగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నిసార్లు పిలిచినా వెళ్లి సత్యాన్ని చెబుతామని విచారణలకు భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ కేసులో ఎలాంటి పస లేదని అధికారులే ముఖ్యమంత్రికి చెప్పినా కేవలం రాజకీయ కక్షతోనే ముందుకు వెళ్తున్నారని విమర్శించారు. చివరికి జైలుకు పంపినా భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు.

# కుట్రలు చేస్తే.. మీ అందరినీ
# రాజకీయ సమాధి చేస్తా

ఏ విధంగా దక్కించుకుంటాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రెండు పార్టీలు ఒకటే అనే విషయం కరీంనగర్ వేదికగా బయటపడుతోందని చెప్పారు. కరీంనగర్ మేయర్ పీఠం తమదేనని బండి సంజయ్ అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేస్తే కరీంనగర్ నుంచే యుద్ధాన్ని ప్రారంభిస్తానని హెచ్చరించారు. వారందరినీ రాజకీయ సమాధి చేస్తానని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. బీజేపీ కార్యకర్తల శక్తి, దమ్ము మీకు తెలియదు అని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్లో బీజేపీకి కేవలం 13 సీట్లే వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇంటెలిజెన్స్ విభాగం నివేదిక ఇచ్చిందని సంజయ్ తెలిపారు.

అందుకే, ఈ విజయాన్ని ఇంటెలిజెన్స్ కే అంకితమిస్తున్నామని అన్నారు. మేయర్ పదవి కోసం గుంటనక్కలన్నీ ఏకమయ్యాయని మండిపడ్డారు. బీజేపీ సింహమని, సింగిల్ గానే వస్తుందని చెప్పారు. మరోవైపు, కరీంనగర్ కార్పొరేషన్లో మొత్తం 66 డివిజన్లు ఉండగా బీజేపీ 30 డివిజన్లలో జయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9 స్థానాలకే పరిమితమయ్యాయి. ఈ నెల 16న కార్పొరేటర్ల ప్రమాణస్వీకారం ఉంటుంది.

# రూ. 3,32 లక్షల కోట్లతో ఏపీ బడ్జెట్

### - మౌలిక వసతులకు ప్రాధాన్యత

విద్య, వైద్యం, మౌలిక వసతులకు బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇచ్చారు. తల్లికి వందనం కోసం రూ 9,600 కోట్లు ప్రతిపాదించారు. విద్యా మిత్ర కోసం రూ 654 కోట్లు కేటాయించారు. పోలవరం కోసం రూ 6,105 కోట్లు ప్రతిపాదన చేసారు. మున్సిపల్ శాఖకు 14,358 కోట్లు, ఈడబ్ల్యూఎస్ సంక్షేమం కోసం 10,699 కోట్లు అమరావతి కోసం ఆరు వేల కోట్లు, ఉన్నత విద్య కోసం రూ 2,566 కోట్లు, మహిళా శిశు సంక్షేమం కోసం రూ 4,581 కోట్లు ప్రతిపాదించారు. మన బడి– మన భవిష్యత్ కోసం రూ 155 కోట్లు ప్రతిపాదించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి రూ 2,161 కోట్లు కేటాయించారు. స్కిల్ డెవలప్ మెంట్ కోసం రూ 1,232 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖకు రూ 11, 118 కోట్లు, స్కాలర్ షిప్ కోసం రూ 3,836 కోట్లు ప్రతిపాదించారు. రూ 30 వేల కోట్లతో హార్టీకల్చర్ క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

# బంగ్లా ప్రధానిగా తారిక్ రెహమాన్

బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్ పీ) చారిత్రాత్మక విజయం సాధించడంతో, పార్టీ చైర్మన్ తారిక్ రెహమాన్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమైంది. సుమారు 17 ఏళ్ల పాటు దేశానికి దూరంగా, అజ్ఞాతవాసంలో ఉన్న ఆయన ఇప్పుడు ఒక్కసారిగా అధికార పీఠాన్ని అధిరోహించనుండటంతో, ఆయన వ్యక్తిత్వం, రాజకీయ ప్రస్థానంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గతంలో ఎక్కువగా తెరవెనుక కార్యకలాపాలకే పరిమితమైన ఆయన గురించి తెలుసుకోవాలన్న కుతూహలం ప్రజల్లో పెరిగింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొన్ని వీడియో క్లిప్పులు ఆయన భిన్నమైన వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఒక వీడియోలో, తనను పదేపదే పొగడొద్దని, అది తనకు నచ్చదని అనుచరులకు ఆయన స్పష్టం చేశారు. మరో సందర్భంలో, కొత్తగా పార్టీలో చేరిన కొందరు నినాదాలు చేస్తుండగా వారిని మందలించారు. పార్టీలోని పాత తరం కార్యకర్తల నుంచి మార్గదర్శకత్వం తీసుకోవాలని సూచించారు. ఇంకో ఘటనలో, ఆయన ప్రయాణిస్తున్న కాన్వాయ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగింది. అక్కడ విధుల్లో ఉన్న పోలీస్ అధికారి ముందుకు వెళ్లమని సూచించినా, ఆయన నిరాకరించి సిగ్నల్ పడే వరకు ఆగడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ పరిణామాలు ఆయన క్రమశిక్షణ, నిబంధనల పట్ల గౌరవాన్ని సూచిస్తున్నాయి.మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహమాన్, మాజీ ప్రధాని ఖలీదా జియాల పెద్ద కుమారుడైన 60 ఏళ్ల తారిక్ రెహమాన్‌పై ప్రజల్లో తీవ్ర ఆసక్తి ఉంది. 1990లు, 2000ల ప్రారంభంలో పార్టీలో వేగంగా ఎదుగుతూ, తెరవెనుక శక్తివంతమైన నేతగా మారారు. అయితే, స్వదేశంలో పెరిగిన రాజకీయ ఒత్తిళ్లు, పలు కేసుల కారణంగా ఆయన సుమారు 17 సంవత్సరాలు లండన్‌లో ప్రవాస జీవితం గడపాల్సి వచ్చింది. అయినప్పటికీ, అక్కడి నుంచే పార్టీ వ్యూహాలను నిర్దేశిస్తూ, కేడర్‌పై తన పట్టును నిలుపుకున్నారు. ఎన్నికల్లో పార్టీ అద్భుత విజయం సాధించడంతో, ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి నాటకీయంగా పునరాగమనం చేశారు. ఎక్కువగా తెరవెనుక ఉండటానికే ఇష్టపడటంతో ఆయనకు ‘డార్క్ ప్రిన్స్’ అనే పేరు స్థిరపడింది. బంగ్లాదేశ్‌లో ఆయనపై అనేక క్రిమినల్ కేసులు, శిక్షలు ఉన్నాయి. అయితే, ఇవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని ఆయన మద్దతుదారులు వాదిస్తుండగా, అవి ఆయన అవినీతి, అధికార దుర్వినియోగానికి నిదర్శనమని విమర్శకులు ఆరోపిస్తున్నారు. ఈ న్యాయపోరాటాలే ఆయన ప్రవాస జీవితానికి కారణమయ్యాయి.కొందరు ఆయన్ను పార్టీకి పునరుజ్జీవం పోయగల నిర్ణయాత్మక నాయకుడిగా చూస్తుంటే, మరికొందరు వారసత్వ రాజకీయ నేతగా విమర్శిస్తున్నారు. ఆయన రాకతో దేశంలో మళ్లీ రాజకీయ ధ్రువీకరణ పెరుగుతుందనే ఆందోళనలు కూడా ఉన్నాయి. ఆయన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే రాజకీయ స్థిరత్వం, దౌత్య సంబంధాల పునఃసమీక్ష, ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడం, మతతత్వ శక్తుల ఒత్తిడిని నియంత్రించడం, శాంతిభద్రతలను పునరుద్ధరించడం వంటి క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సమర్థవంతమైన కేబినెట్‌ను ఏర్పాటు చేయడం, పార్టీ అంతర్గత విభేదాలను పరిష్కరించడం, అందరినీ కలుపుకొనిపోయే పాలన అందిస్తామని ప్రజలకు భరోసా ఇవ్వడం తక్షణ కర్తవ్యాలుగా మారాయి. అన్నింటికన్నా ముఖ్యంగా, పొరుగు దేశమైన భారత్‌తో దౌత్య సంబంధాలను తిరిగి బలోపేతం చేసుకోవడం అత్యవసరం. బంగ్లాదేశ్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని భారత్ ఇప్పటికే సంకేతాలు పంపింది. అయితే, ప్రవాసంలో ఉన్న రాజకీయ నేతల భవిష్యత్తు, పాకిస్థాన్‌తో సంబంధాల వంటి సున్నితమైన అంశాలపై ఢాకా వైఖరిని భారత్ జాగ్రత్తగా గమనిస్తుంది. మరోవైపు, గత తాత్కాలిక ప్రభుత్వం పాకిస్థాన్, చైనాలతో పెంచుకున్న సంబంధాల ఒత్తిడిని కూడా కొత్త ప్రభుత్వం ఎదుర్కోవాల్సి ఉంటుంది.
దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న వస్త్ర పరిశ్రమ తీవ్రమైన పోటీని ఎదుర్కొంటోంది. అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం కొంత ఉపశమనం కలిగించవచ్చని అంచనా. కానీ, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. యూఎస్ఏఐడీ సహాయం ఉపసంహరించుకోవడంతో ఆరోగ్య రంగంపై కూడా ఒత్తిడి పెరిగింది. మరోవైపు, 2024లో జరిగిన అల్లర్ల తర్వాత అవామీ లీగ్ కార్యకర్తలపై దాడులు, హిందువుల హత్యలతో శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ పరిణామాలు దేశ పోలీస్ వ్యవస్థలో నైతిక స్థైర్యాన్ని దెబ్బతీశాయి. మొత్తంగా, ‘నీడల యువరాజు’గా ఉన్న తారిక్ రెహమాన్ ఇప్పుడు వెలుగులోకి వచ్చారు. ఆయన ముందున్న మార్గం సుదీర్ఘమైనది, అత్యంత కఠినమైనది అనడంలో సందేహం లేదు.

# ఏపీ అసెంబ్లీలో ఆధ్యాత్మిక శోభ

చెందిన మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు శివతత్వానికి ప్రతీకగా ఉన్న చీరలను ధరించి సభకు హాజరయ్యారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం వీరంతా ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఒకే రకమైన వస్త్రధారణతో అసెంబ్లీకి విచ్చేసిన మహిళా ప్రజాప్రతినిధులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, ఎస్. సవితతో పాటు ఇతర మహిళా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ మహిళా నేతలు ఈ విధంగా ప్రత్యేకతను చాటడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం, అసెంబ్లీ లాబీల్లో ఈ మహిళా ప్రజాప్రతినిధులు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణలను కూడా కలిసి మాట్లాడారు. దీంతో శాసనసభ ప్రాంగణంలో సందడి వాతావరణం కనిపించింది.

# హంగ్ మున్సిపాలిటీలపై కాంగ్రెస్ కన్ను

కలిసికట్టుగా పనిచేయడం వల్లే సత్ఫలితాలు సాధించినట్లుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ ఫలితాలపై నేతలతో చర్చించారు. హంగ్ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కైవసం చేసుకోవడంపై మంత్రులకు రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. మేయర్, చైర్మన్ల పదవులపై కీలక సూచనలు చేశారు. పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేసిన పార్టీ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నమ్మకాన్ని కల్పించామన్న సీఎం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత ముందుకెళ్లాలని మంత్రులు, పార్టీ నేతలకు సూచించారు. సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి మరింత తీసుకెళ్లాలన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. వాటి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### - మున్సిపాలిటీలకు కొత్త రూపం

ఎన్నికల విజయం కేవలం ఆరంభం మాత్రమేనని, అసలైన అభివృద్ధి ఇప్పుడే మొదలవ్వాలని మంత్రులకు సీఎం సూచించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు, మంత్రులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను, సంక్షేమ ఫలాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో వచ్చే అన్ని ఎన్నికలనూ ఎదుర్కోవాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# ఇక ఆధార్ కార్డుకు కొత్త రూపు

ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్ కార్డు ఫోటోకాపీలను ఇస్తున్నాం. ఈ కార్డులపై 12 అంకెల ఆధార్ నంబర్‌తో పాటు పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి అత్యంత సున్నితమైన సమాచారం ముద్రించి ఉంటోంది. ఈ ఫోటోకాపీలు నేరగాళ్ల చేతికి చిక్కితే గుర్తింపు చోరీ (ఐడెంటిటీ థెఫ్ట్), ఆర్థిక మోసాలు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉందని యూఐడీఏఐ గుర్తించింది. ఈ సమస్యను అధిగమించేందుకు, కొత్తగా జారీ చేయబోయే ఆధార్ కార్డులపై కేవలం కార్డుదారుడి ఫోటో, ఒక ప్రత్యేకమైన ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్ మాత్రమే ప్రదర్శించాలని యూఐడీఏఐ యోచిస్తోంది. ఆధార్ నంబర్, చిరునామా వంటి వివరాలన్నీ ఈ క్యూఆర్ కోడ్‌లో భద్రంగా నిక్షిప్తమై ఉంటాయి. గుర్తింపు ధృవీకరణ అవసరమైనప్పుడు, సంబంధిత సంస్థలు తమ వద్ద ఉన్న అధీకృత యాప్‌ల ద్వారా ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాలను సరిచూసుకుంటాయి. దీనివల్ల కేవైసీ ప్రక్రియ వేగవంతం అవ్వడమే కాకుండా, వ్యక్తిగత సమాచారానికి పూర్తి భద్రత లభిస్తుంది. గత ఏడాది నుంచే ఈ మార్పులపై కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడవచ్చని తెలుస్తోంది. ఆధార్ ఫోటోకాపీల ద్వారా జరిగే దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కొత్త నిబంధనలు తీసుకొస్తున్నామని యూఐడీఏఐ సీఈవో భువనేశ్ కుమార్ ఇటీవలే ఒక సమావేశంలో స్పష్టం చేశారు. ఇటీవల విడుదల చేసిన కొత్త ఆధార్ మొబైల్ యాప్‌లో కూడా లాగిన్ అయిన తర్వాత కేవలం ఫోటో, క్యూఆర్ కోడ్ మాత్రమే కనిపించేలా మార్పులు చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రతిపాదన అమలైతే ఆధార్ గోప్యత మరింత పటిష్ఠం అవుతుందని, మోసాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడుతుందని సాంకేతిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# 360 డిగ్రీస్ గ్రోత్ మోడల్

గ్రామం నుంచి గ్లోబల్ స్థాయి వరకు విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, యువత, మహిళా సాధికారత, సాంకేతికత వంటి అన్ని రంగాలను ముందుకు తీసుకెళ్లేలా ఈ బడ్జెట్ ఉందని అన్నారు. సంక్షేమంతో కూడిన అభివృద్ధి ఫలాలను సమాజంలోని అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యతతో అందించాలనే లక్ష్యం ఇందులో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు.
ముఖ్యంగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ఏకంగా రూ.22,942 కోట్లు కేటాయించడం శుభపరిణామమని పవన్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో గ్రామాలే కీలకమనే విషయాన్ని ఎన్డీయే ప్రభుత్వం మరోసారి చాటిచెప్పిందని తెలిపారు.

ఈ కేటాయింపులతో గ్రామీణ మౌలిక సదుపాయాలు, రహదారుల నిర్మాణం, ఇంటింటికీ సురక్షిత తాగునీటి సరఫరా, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు స్థానిక పాలనను బలోపేతం చేసి గ్రామాల ఆర్థిక పరిపుష్టికి దోహదపడతాయని వివరించారు. అదేవిధంగా పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖకు రూ.714 కోట్లు కేటాయించడం ద్వారా ‘హరిత ఆంధ్రప్రదేశ్’ లక్ష్య సాధన పట్ల ప్రభుత్వ నిబద్ధత స్పష్టమవుతోందని పవన్ కల్యాణ్ తెలిపారు. 2030 నాటికి 37 శాతం, 2047 నాటికి 50 శాతం గ్రీన్ కవర్ సాధించే దిశగా ఈ నిధులు ఉపయోగపడతాయని, అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణకు మరింత చేయూత లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమగ్ర బడ్జెట్‌ను రూపొందించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడులకు ఆయన మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేశారు.

# ఇది ట్రైలర్ మాత్రమే..
# అసలు సినిమా ముందుంది

కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ, గతంలో 90 శాతం మున్సిపాలిటీలను గెలుచుకున్న బీఆర్ఎస్ ఈసారి 16 స్థానాలకే పరిమితమైందని కవిత గుర్తు చేశారు. ప్రజల మద్దతును ఎందుకు కోల్పోయామో బీఆర్ఎస్ ఆలోచించాలని సూచించారు.ఉత్తర తెలంగాణలో బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్ పనిచేసిందని కవిత ఆరోపించారు. ఆ రెండు పార్టీల పొత్తుకు ఇది తొలి మెట్టు అన్నారు. కాంగ్రెస్ పార్టీతో మిలాఖత్ అయిన సీపీఐకి కొత్తగూడంలో బీఆర్ఎస్ పార్టీ మద్దతివ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై సాంబశివరావు చేసిన ఆరోపణలను అంగీకరిస్తున్నారా అని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు.

తెలంగాణలో ప్రత్యామ్నాయం లేకపోవడం వల్లే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటు వేశారని అన్నారు. ఆ లోటును తెలంగాణ జాగృతి భర్తీ చేస్తుందని కవిత పేర్కొన్నారు. బీజేపీ కరీంనగర్‌లో తప్ప ఎక్కడా గెలవలేదని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ రూ.30 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. తమకు 17 స్థానాలు రావడమే చాలా ఎక్కువ అన్నట్లుగా కేటీఆర్ మాట్లాడటం విచిత్రమని కవిత అన్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిబంధనలను ఉల్లంఘించారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు.

### - వడ్డేపల్లి మున్సిపాలిటీ విజయంపై కవిత

జాగృతి రాజకీయ పార్టీగా మారబోతుందని ప్రకటించిన తర్వాత తమ పార్టీకి చెందిన నాయకులు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారని అన్నారు. తక్కువ సమయంలోనే ప్రజలు తమను ఆదరించారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి, ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ కలిసి పోటీ చేసి అద్భుత విజయాన్ని సాధించాయని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తాము 40 వార్డులు గెలుచుకున్నామని అన్నారు. అధికారికంగా 33 స్థానాల్లో తమ అభ్యర్థులు విజయం సాధించారని, మరో 7చోట్ల సాంకేతిక కారణాల వల్ల స్వతంత్రులుగా గెలిచారని వెల్లడించారు. ముఖ్యంగా వడ్డేపల్లి మున్సిపాలిటీలో తమకు స్పష్టమైన మెజారిటీ వచ్చిందని కవిత వెల్లడించారు. తమ విజయంలో తెలంగాణ జాగృతి ప్రమేయం లేదని ఏఐఎఫ్‌బీ నాయకుడు వడ్డేపల్లి శ్రీనివాసులు నిన్న ప్రకటించారు. అయితే ఈరోజు కవిత ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి అంబటి బోజిరెడ్డి, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించడం గమనార్హం. వడ్డేపల్లి మున్సిపాలిటీలో తెలంగాణ జాగృతి, ఏఐఎఫ్‌బీ కలిసి కైవసం చేసుకున్నాయని కవిత స్పష్టం చేశారు.

### తీర్థయాత్రకు వెళ్లి వచ్చేసరికి

# రిటైర్డ్ లైన్‌మెన్ ఇంట్లో చోరీ.

**మధురవాడ** తీర్థయాత్రలకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఓ రిటైర్డ్ లైన్‌మెన్ ఇంట్లో చోరీ జరిగిన ఘటన పీ.ఎం.పాలెం క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం?మధురవాడ శివశక్తినగర్ రోడ్డు వివేకానంద కాలనీలో నివసిస్తున్న విశ్రాంత లైన్‌మెన్ బొడ్డేటి అప్పలరాజు (62) ఈనెల 2వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లారు. శనివారం (14వ తేదీ) ఉదయం యాత్ర ముగించుకుని ఇంటికి చేరుకోగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి షాక్‌కు గురయ్యారు. ఇంటి లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలో భద్రపరిచిన సుమారు 21 తులాల బంగారం మరియు రూ.6 లక్షల నగదు దొంగలు అపహరించినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పీ.ఎం.పాలెం క్రైమ్ సీఐ బి.ఎస్.ఎస్. ప్రకాష్ పర్యవేక్షణలో ఎస్.ఐ. సూర్యప్రకాష్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ సహాయంతో వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు,

# నా మద్దతు బీఆర్ఎస్ కే..

- వికారాబాద్ లో స్వతంత్ర అభ్యర్థి
- పోలీసుల అత్యుత్సాహం

**వికారాబాద్** వికారాబాద్ జిల్లాలో పోలీసులు అత్యుత్సాహం బయటపడింది. బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపిన స్వతంత్ర అభ్యర్థిని తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేసారు. తన ఇష్టంతోనే బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్నానని అభ్యర్థి, చెప్పడంతో పోలీసులు నిరాశతో వెనుదిరిగారు. వికారాబాద్ జిల్లాలో తాను బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తానని ఒకటవ వార్డులో గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థి అక్కమ్మ మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఇంటికి చేరుకుంది. అయితే అక్కమ్మ కొడుకు బాలు తన తల్లిని బీఆర్ఎస్ నాయకులు కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేసాడు. బాలు ఫిర్యాదు మేరకు కొప్పుల మహేష్ రెడ్డి ఇంటికి చేరుకుని, అక్కమ్మను తీసుకెళ్లేందుకు పోలీసుల విఫల ప్రయత్నం చేసారు. తాను తన ఇష్టంతోనే బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నానని అక్కమ్మ స్టేట్మెంట్ ఇవ్వడంతో పోలీసులు వెనుతిరిగారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో మరోసారి అక్కమ్మను తీసుకెళ్లేందుకు వచ్చిన పోలీసులను బీఆర్ఎస్ కార్యకర్తలు తిప్పి పంపారు.

# సేవాలాల్ మహారాజ్ జయంతి

### - పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

**హైదరాబాద్** బంజారా ల ఆరాధ్య దైవం శ్రీ సేవాలాల్ మహరాజ్ అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా వాఖీ నగర్ లోని బాపూనగర్ కమిటీ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముందుగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటం వద్ద పూలు ఉంచి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బోధించిన సత్యం, ధర్మం, అహింసా మార్గంలను అనుసరించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళులు అన్నారు. బంజారాల ఐక్యత కోసం ఎంతో కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని గుర్తు చేశారు.

# కారెక్కిన ఇద్దరు ఇండిపెండెంట్లు

పటాన్ చెరుగూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో ఇద్దరు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని 5 మున్సిపాలిటీలలో ఇప్పటికే గడ్డపోతారం, గుమ్మడిదల బీఆర్ఎస్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే.

జిన్నారం, ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీలలో హంగ్ ఏర్పడింది.ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో ఇస్నాపూర్ మున్సిపాలిటీలలోని 10వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఎల్లకొండ రాహుల్ రెడ్డి, ఇంద్రేశం మున్సిపాలిటీలలోని 2వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ సార లావణ్య బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

# ఔషధ మొక్కలపై అంతర్జాతీయ సదస్సు





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఔషధ మొక్కలు, సహజ ఉత్పత్తుల పరిశోధనలో నూతన ఆవిష్కరణలు మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ఘనంగా ముగింపు హైదరాబాద్ బేగంపేట్‌లోని హోటల్ ది ప్లాజాలో ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు "ఇన్నోవేషన్స్ ఇన్ మెడిసినల్ ప్లాంట్స్ అండ్ నేచురల్ ప్రోడక్ట్స్ రీసెర్చ్" అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు విజయవంతంగా నిర్వహించబడింది. తెలంగాణ మెడిసినల్ ప్లాంట్స్ బోర్డు, ఆరోగ్య వైద్య & కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, ఆర్.బి.వి.ఆర్.ఆర్. మహిళా కళాశాల హైదరాబాద్, సోసైటీ ఫర్ కన్జర్వేషన్ అండ్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఆఫ్ మెడిసినల్ ప్లాంట్స్ న్యూఢిల్లీ, సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించాయి.సదస్సును ముఖ్య అతిథి ప్రొఫెసర్ జె. ప్రతాప్ రెడ్డి, వైస్ చాన్సలర్, కాకతీయ విశ్వవిద్యాలయం ప్రారంభించి, సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. గౌరవ అతిథిగా డాక్టర్ ఎ. సోనిబాలా దేవి, ఐఎఫ్ఎస్, వైస్ చైర్‌పర్సన్ & ఎండీ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, తెలంగాణ మెడిసినల్ ప్లాంట్స్ బోర్డు పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా డాక్టర్ గోవింద్ ప్రతాప్ రావు, అధ్యక్షుడు, ఎన్‌సీఆర్‌డీఎంపీ, న్యూఢిల్లీ, ఎన్. రాజేంద్ర కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, తెలంగాణ మెడిసినల్ ప్లాంట్స్ బోర్డు, ప్రిన్సిపల్ డాక్టర్ జె. అచ్యుత దేవి, డాక్టర్ ఎస్. రవికిరణ్ తదితరులు హాజరయ్యారు.మొదటి రోజు కీనోట్ సెషన్, ప్లీనరీ సెషన్‌తో పాటు రెండు సాంకేతిక సెషన్లు నిర్వహించి, 21 మౌఖిక ప్రజెంటేషన్లు, 16 పోస్టర్ ప్రజెంటేషన్లు నిర్వహించారు.రెండో రోజు సమాంతర సాంకేతిక సెషన్లలో 53 మౌఖిక ప్రజెంటేషన్లు, 16 పోస్టర్ ప్రజెంటేషన్లు నిర్వహించారు. మూడో రోజు సంప్రదాయ వనౌషధ వైద్యులతో "మెడిసినల్ ప్లాంట్స్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్" నిర్వహించారు. ప్రముఖ వక్తలుగా డాక్టర్ కె. నర్సింహ రెడ్డి (రిటైర్డ్ అదనపు డైరెక్టర్, ఆయుష్) డాక్టర్ సురేష్ జకోటియా (రిటైర్డ్ సీనియర్ మెడికల్ ఆఫీసర్, ఆయుష్) పాల్గొన్నారు.మొత్తంగా 13 అంతర్జాతీయ వక్తలు సహా దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు కలిపి 150 పరిశోధన పత్రాలు ప్రదర్శించారు. యువ పరిశోధకులకు ఔషధ మొక్కలు, సహజ ఉత్పత్తుల రంగంలో నూతన సాంకేతికతలపై అవగాహన కల్పించారు. వాలెడిక్టరీ కార్యక్రమంలో ముఖ్య అతిథి డాక్టర్ కె. నర్సింహ రెడ్డి, అమెరికాలోని అలబామా ఎ & ఎం యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ శ్రీనివాస్ రావు మెంట్రెడ్డి ఉత్తమ వక్తలు, ఉత్తమ పత్ర ప్రదర్శకులకు పురస్కారాలు అందజేశారు.

ఈ సదస్సు ద్వారా కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం లభించిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. మూడు రోజుల ఈ అంతర్జాతీయ సదస్సులో 550 మందికి పైగా

## మహాశివరాత్రి వేడుకలకు

# ముస్తాబైన భీమేశ్వర ఆలయం

– విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న ఆలయం






వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని భక్తుల కోసం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టారు. జాతరకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చే అవకాశముందని అంచనా వేస్తూ ఆలయ అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రపరచి, పార్కింగ్ ప్రదేశంలో శివార్చన కార్యక్రమాల కోసం ప్రత్యేక వేదికను సిద్ధం చేశారు. భక్తులు ఇబ్బంది పడకుండా చలువ పందిళ్లు, టెంట్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు స్వామి, అమ్మవార్ల రూపాలతో లైటింగ్ డిజైన్లు, ఆహ్వాన తోరణాలు ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక వాతావరణం సృష్టించారు. భక్తుల మార్గదర్శకత్వం కోసం మైక్, సౌండ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేయగా, తాత్కాలిక మరుగుదొడ్లు, సూచన బోర్డులు, స్నానాల కోసం షవర్స్ వంటి సదుపాయాలు కల్పించారు. రద్దీ నియంత్రణ కోసం అదనపు క్యూ లైన్లు కూడా ఏర్పాటు చేశారు. జాతర సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని దేవస్థానం వర్గాలు తెలిపాయి. మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ సిబ్బంది పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నారు.

# భోజనం చేసిన వెంటనే యోగా చేస్తే..!



యోగికి ఎటువంటి వ్యాధి లేనట్లుగా, యోగా చేసేవారి ఆరోగ్యానికి ఏ ఢోకా ఉండదని చెబుతున్నారు నిపుణులు. యోగాతో పాటు, ఆహారానికి కూడా మంచి ప్రాముఖ్యత ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం ఎలా ఉండాలి? ఆహారం తినడానికి, యోగా చేయడానికి మధ్య ఎంత సమయం ఉండాలి? ఆరోగ్యంగా ఉండాలంటే రోజువారీ కార్యకలాపాల్లో శారీరక వ్యాయామాన్ని భాగం చేసుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా చిన్నపాటి యోగాసనాలు ఆరోగ్యానికి చెప్పలేనంత మేలు చేస్తాయి. యోగా శరీర వశ్యతను పెంచడంలో సహాయపడటమే కాకుండా, మొత్తం ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. యోగికి ఎటువంటి వ్యాధి లేనట్లుగా, యోగా చేసేవారి ఆరోగ్యానికి ఏ ఢోకా ఉండదని చెబుతున్నారు నిపుణులు. యోగాతో పాటు, ఆహారానికి కూడా మంచి ప్రాముఖ్యత ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం ఎలా ఉండాలి? ఆహారం తినడానికి, యోగా చేయడానికి మధ్య ఎంత సమయం ఉండాలి? అనే విషయాల గురించి సీనియర్ డైటీషియన్, డయాబెటిస్ నిపుణుడు డాక్టర్ నిషా జైన్ మాట్లాడుతూ.. యోగా చేయడానికి ముందు మీ కడుపు సాధ్యమైనంత వరకు ఖాళీగా ఉండాలని అన్నారు. భోజనానికి, యోగాకు మధ్య కనీసం 8 నుంచి 10 గంటల గ్యాప్ నిర్వహించడం మంచిదని సూచించారు. సాయంత్రం త్వరగా భోజనం తినవచ్చు. ఆ తర్వాత ఆ మరుసటి రోజు ఉదయం పూట యోగా క్షేమంగా చేయవచ్చు. అయితే పగటిపూట యోగా చేస్తుంటే మాత్రం తినడానికి, యోగాకి మధ్య కనీసం 1 గంట గ్యాప్ అవసరమని చెప్పారు. అంటే భోజనం తిన్న 1 గంటలోపు యోగా చేయకుండా ఉండాలని అంటున్నారు. యోగా చేసే ముందు తేలికైన ఆహారాలు తినవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. యోగా చేసే ముందు గ్రీన్ టీ, బ్లాక్ కాఫీ, అరటిపండ్లు, ఆపిల్స్ తినవచ్చు. నట్స్, డ్రైఫ్రూట్స్ వంటి ఆహారాలు తినవచ్చు. ఈ ఆహారాలు శరీరంలో నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తాయి. ఇది యోగా సమయంలో శరీరాన్ని చురుగ్గా ఉంచుతుంది కూడా. ముఖ్యంగా యోగా చేసే ముందు వేయించిన లేదా కారంగా ఉండే ఆహారాన్ని పూర్తిగా మానేయడం మంచిది. ఇది కడుపు ఉబ్బరం, కడుపులో భారమైన అనుభూతి, వికారం వంటి లక్షణాలను కలిగిస్తుంది. యోగా చేసిన 30 నిమిషాల తర్వాత పుష్కలంగా నీరు తాగాలి. ఇది శరీరాన్ని తిరిగి హైడ్రేట్ చేస్తుంది. దీనితో పాటు, కొబ్బరి నీరు లేదా నిమ్మకాయ నీరు కూడా తాగవచ్చు. అలాగే యోగా తర్వాత ప్రోటీన్ ఆహారాలు కూడా తీసుకోవచ్చు. ఇందుకోసం ఉడికించిన గుడ్లు తినవచ్చు.

# జ్వరానికి అసలు కారణం ఏంటి..?



మన శరీరానికి చాలా రకాల ఇన్ ఫెక్షన్లు వస్తాయి. వాటిలో ముఖ్యంగా వైరస్ లు, బ్యాక్టీరియా వల్ల వచ్చేవి ఎక్కువగా ఉంటాయి. ఒక వ్యక్తిని పరీక్ష చేసిన తర్వాత డాక్టర్ ఇది వైరల్ ఫీవర్ అని చెప్పడం మనం తరచూ వింటాం. కానీ అది వైరస్ వల్ల వచ్చిందని ఎలా అర్థం చేసుకోవాలి..? బ్యాక్టీరియా వల్ల వచ్చిందా లేదా వైరస్ వల్ల వచ్చిందా అని ఎలా తెలుసుకోవాలి..? ఈ రెండింటి మధ్య తేడాలు తెలుసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. వైరస్ లు, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లు ఈ రెండు జబ్బులు సూక్ష్మజీవుల వల్ల వస్తాయి. కానీ అవి శరీరంపై పని చేసే విధానం వేరుగా ఉంటుంది. బ్యాక్టీరియా అనేది సొంతంగా బతకగల ఒకే కణం జీవి. కొన్ని రకాల బ్యాక్టీరియా శరీరానికి హానికరం కావు. కానీ కొన్ని రకాల బ్యాక్టీరియా జబ్బులు కలిగిస్తాయి. ఉదాహరణకు టీబీ (ట్యూబర్క్యులోసిస్), యూరినరీ ట్రాక్ట్ ఇన్ ఫెక్షన్లు, గొంతు నొప్పి లాంటివి ఈ రకానికి చెందుతాయి. ఇవి యాంటీబయోటిక్ మందులతో నయం అవుతాయి. వైరస్ లు చాలా చిన్న జీవులు. ఇవి శరీరంలోకి వెళ్ళిన తర్వాత మంచి కణాలను ఆక్రమించి పెరుగుతాయి. వాటి వల్ల జలుబు, దగ్గు, జ్వరం, కోవిడ్ లాంటి జబ్బులు వస్తాయి. వైరల్ ఇన్ ఫెక్షన్ కు యాంటీబయోటిక్స్ పని చేయవు.వైరల్, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లకు కొన్ని లక్షణాలు ఒకేలా కనిపించవచ్చు. ఉదాహరణకు జ్వరం, గొంతు నొప్పి, అలసట, ఒళ్ళు నొప్పులు రెండింటిలోనూ రావచ్చు. కానీ వైరల్ ఇన్ ఫెక్షన్లు సాధారణంగా నెమ్మదిగా వస్తూ 5 నుంచి 10 రోజుల్లో తగ్గిపోతాయి. అయితే బ్యాక్టీరియల్ ఇన్ ఫెక్షన్లు రోజురోజుకూ తీవ్రంగా మారతాయి. వాటిని వదిలేస్తే ఇతర శరీర భాగాలకు వ్యాపించే ప్రమాదం ఉంటుంది.చాలా సార్లు డాక్టర్లు లక్షణాలను చూసి చెబుతారు. అయితే కచ్చితంగా తెలుసుకోవాలంటే రక్త పరీక్ష, మూత్ర పరీక్ష లాంటివి అవసరం. కొన్నిసార్లు గొంతు స్రావాన్ని కూడా చూడాలి. కొన్ని వైరల్ జబ్బులు పొక్కులు లాగా కనిపిస్తాయి.. ఉదాహరణకు ఆటలమ్మ, అమ్మవారు లాంటివి. కానీ కొన్నింటిని గుర్తించడానికి టెస్టులు అవసరం.. ఉదాహరణకు కోవిడ్, హెపటైటిస్. చికిత్స పూర్తిగా జబ్బుకు కారణాన్ని బట్టి నిర్ణయించాలి. వైరస్ వల్ల వచ్చిన ఇన్ ఫెక్షన్ లకు ఎక్కువగా విశ్రాంతి, ద్రవ పదార్థాలు తీసుకోవడం, కొన్ని ఉపశమనం ఇచ్చే మందులు వాడటమే చేస్తారు. బ్యాక్టీరియల్ ఇన్ ఫెక్షన్లు అయితే డాక్టర్ సూచన మేరకు యాంటీబయోటిక్స్ తీసుకోవాలి. కానీ వాటిని అనవసరంగా వాడకూడదు. అది రోగనిరోధక శక్తిని తగ్గిస్తుంది. అలాగే జాగ్రత్తలు తీసుకోవడం వల్ల జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. ఈ రెండు రకాల జబ్బులను కొన్ని సాధారణ జాగ్రత్తలతో ఆపవచ్చు. జబ్బుతో ఉన్నవారికి దూరంగా ఉండడం.గోరువెచ్చని నీళ్లు తాగడం.చేతులు కడగకుండా ముఖాన్ని తాకకూడదు. మాస్క్ వాడటం, శుభ్రత పాటించడం ముఖ్యమైనవి. వైరల్, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్ల లక్షణాలు కొంతవరకు ఒకేలా కనిపించినా.. చికిత్స పూర్తిగా వేరుగా ఉంటుంది. సరైన పరీక్షల ద్వారానే సరైన వైద్యం అందుతుంది. అందుకే మనం జాగ్రత్తగా ఉండి.. ఏ లక్షణాలు కనిపించినా డాక్టర్లను కలిసి కారణాన్ని కచ్చితంగా తెలుసుకొని చికిత్స తీసుకోవాలి.

## ఖాళీ కడుపుతో బెండకాయ

# నీరు తాగితే..?




మనకు సులభంగా దొరికే కూరగాయల్లో బెండకాయ ఒకటి. ఇది మన వంటకాల్లో తరచుగా వాడతాం. తక్కువ కేలరీలు, ఎక్కువ పోషకాలు ఉన్న బెండకాయ నీళ్లు ఆరోగ్యానికి చాలా మంచివని నిపుణులు చెబుతున్నారు. బెండకాయను రాత్రి నీటిలో నానబెట్టి ఆ నీటిని ఉదయం ఖాళీ కడుపుతో తాగితే శరీరానికి చాలా మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కానీ దీన్ని ఎంత మోతాదులో తీసుకోవాలి, ఎవరు తాగాలి, ఎవరు తాగకూడదు అన్నదానిపై పూర్తి అవగాహన ఉండాలి. బెండకాయలో ఎక్కువగా ఉండే ఫైబర్ పేగుల పనితీరును మెరుగుపరుస్తుంది. దీని వల్ల మలబద్ధకం తగ్గుతుంది. అజీర్తి లాంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. బెండకాయలో గ్లూకోజ్ను శరీరం తీసుకోకుండా తగ్గించే గుణం ఉంది. ఇది షుగర్ను అదుపులో ఉంచడంలో సాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి. గుండెకు రక్షణ ఇస్తాయి. రక్తనాళాల్లో వాపు తగ్గి గుండె సంబంధిత సమస్యల నుంచి కాపాడుతుంది. బెండకాయలో కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ %ఖ% లాంటి పోషకాలు చాలా ఉంటాయి. ఇవి ఎముకలు గట్టిగా అయ్యేలా చేస్తాయి. ఈ నీళ్లు తాగిన తర్వాత కడుపు నిండినట్లు అనిపిస్తుంది. దీని వల్ల ఆకలి తగ్గి ఎక్కువ ఆహారం తీసుకోవడం తగ్గుతుంది. దాంతో బరువు అదుపులో ఉంటుంది. బెండకాయలో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు ఉండటం వల్ల చర్మ సమస్యలు తగ్గుతాయి. ముడతలు, మొటిమలు తగ్గడంలో సాయపడతాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. వాంతులు, గ్యాస్, కడుపు ఉబ్బరం.. ఎక్కువ ఫైబర్ వల్ల కొందరికి అజీర్తి లాంటి ఇబ్బందులు రావచ్చు. అలర్జీ వచ్చే అవకాశం.. కొందరు బెండకాయకు అలర్జీ కలిగి ఉంటారు. అలాంటి వారు ఈ నీటిని తాగకూడదు. ఫ్రక్టోజ్ వల్ల అసౌకర్యం.. బెండకాయలో ఉండే ఫ్రక్టోజ్ వల్ల కొందరికి గ్యాస్, అసౌకర్యం కలగవచ్చు. కిడ్నీలో రాళ్లు ఉన్నవారు జాగ్రత్త.. ఇందులో ఉండే ఆక్సలేట్ పదార్థం రాళ్లు ఏర్పడటానికి కారణం అవుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.

బెండకాయ నీళ్ల తయారీ విధానం: ఐదు తాజా బెండకాయలు తీసుకోండి. వాటి చివర్లు కట్ చేసి మధ్యలో చీల్చండి.వీటిని రెండు గ్లాసుల నీటిలో రాత్రంతా నానబెట్టండి.ఉదయం ముక్కలను తీసివేసి ఆ నీటిని ఖాళీ కడుపుతో తాగండి. బెండకాయ నీళ్లు సహజంగా ఆరోగ్యాన్ని పెంచే ఒక మంచి మార్గం. కానీ దీన్ని రోజూ తీసుకునే ముందు మీ ఆరోగ్య పరిస్థితులను ఆలోచించుకోండి. అవసరమైతే డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది.

# చియా సీడ్స్, నల్లఎండు ద్రాక్ష

## కలిపి నానపెట్టిన నీటితో ఇన్ని లాభాలా..?



వాటి నీరు గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ రెండింటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉన్నాయి. ప్రతిరోజూ వాటి నీటిని తాగడం వల్ల ఎముకలు బలోపేతం అవుతాయి. ఎండుద్రాక్షలో విటమిన్ సి, చియా విత్తనాలలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. వీటి నీరు రోగ నరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. నల్ల ఎండుద్రాక్ష, చియా సీడ్స్ కలిపి తయారు చేసిన వాటర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ రెండింటినీ కలిపి తాగడం వల్ల శరీరానికి లోపలి నుంచి పోషణ, శక్తి లభిస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. నల్ల ఎండుద్రాక్షలో ఐరన్, చియా విత్తనాలలో ఫైబర్, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వీటి నీటిని తాగడం వల్ల శరీరంలో హిమోగ్లోబిన్ పెరిగి రక్తహీనత సమస్య తొలగిపోతుంది. చియా విత్తనాలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఎండుద్రాక్ష కూడా జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇవి నానబెట్టిన నీరు మలబద్ధకం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలను తొలగిస్తుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ సహజ చక్కెర మరియు ప్రోటీన్ కలిగి ఉంటాయి, ఇవి శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. ఉదయాన్నే వీటి నీటిని తాగడం వల్ల రోజంతా చురుగ్గా ఉండవచ్చు. చియా విత్తనాలు ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతాయి. ఎండుద్రాక్ష స్వీట్ తినాలన్న కోరికను తగ్గిస్తుంది. వాటి నీరు కొవ్వును వేగంగా కరిగిస్తుంది. బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి నానబెట్టిన నీటిని ప్రతిరోజూ ఉదయం తాగడం వల్ల చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుతుంది. ఎండుద్రాక్ష, చియా విత్తనాలలో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు, పొటాషియం ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ ను నియంత్రిస్తాయి. వాటి నీరు గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ రెండింటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉన్నాయి. ప్రతిరోజూ వాటి నీటిని తాగడం వల్ల ఎముకలు బలోపేతం అవుతాయి. ఎండుద్రాక్షలో విటమిన్ సి, చియా విత్తనాలలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. వీటి నీరు రోగ నరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయి.

# బడ్జెట్ లో బీసీ సంక్షేమానికి అగ్రతాంబూలం

**మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే గల్లా మాధవి**



అమరావతి (ప్రశ్న న్యూస్)గత వైఎస్సార్‌సీపీ పాలనలో అన్యాయానికి గురైన బీసీ వర్గాలకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బీసీల అభివృద్ధి కోసం బడ్జెట్ చారిత్రాత్మకమైన నిధులను కేటాయిస్తూ, వారి ఆర్థిక, సామాజిక పురోభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో (2022-23) బీసీలకు కేవలం రూ. 26 వేల కోట్లు మాత్రమే కేటాయించగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్‌ను భారీగా పెంచిందని వివరించారు. 2024-25: రూ. 39,000 కోట్లు, 2025-26: రూ. 47,000 కోట్లు, 2026-27: సుమారు రూ. 51,021 కోట్లు (బాహుబలి బడ్జెట్) ను కేటాయించారని అన్నారు.
నా బీసీలు, నా వెన్నుముక అని ఓట్లు వేయించుకున్న జగన్మోహన్ రెడ్డి, అధికారం రాగానే వారిని విస్మరించారని మంత్రి విమర్శించారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లను 34% నుండి 24%కి తగ్గించడం ద్వారా దాదాపు 16,800 మంది బీసీలు పదవులకు దూరమయ్యారు. జీవో నెం. 6 ద్వారా బీసీ కార్పొరేషన్ నిధుల నుంచి సుమారు రూ. 3,432 కోట్లను ఇతర అవసరాలకు దారిమళ్ళించి బీసీలను మోసం చేశారు. వైసిపి హయాంలో 26 మంది బీసీల హత్యలు జరిగాయని, 2,540 మందిపై దాడులు చేసి, 650 మంది నేతలపై అక్రమ కేసులు పెట్టారని ధ్వజమెత్తారు. చంద్రబాబు నాయుడు సారథ్యంలో బీసీలకు మళ్ళీ పూర్వవైభవం వస్తోందని మంత్రి పేర్కొన్నారు.

# ఆరోగ్యానికి రూ.19,306 కోట్ల కేటాయింపు

**-ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల కంటే 9.5% అదనం**
**-పి.యమ్ అభిమ్ కింద రూ.838 కోట్లు**
**-ఎన్టీఆర్ బేబీ కిట్ పథకం పునరుద్ధరణ- రూ.51.15 కోట్ల కేటాయింపు**
**-శాఖల వారీగా నిధుల కేటాయింపుల్లో ఆరోగ్యానికి 4వ స్థానం.**
**రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్.**



సత్యకుమార్ యాదవ్.

అమరావతి (ప్రశ్న న్యూస్) 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆరోగ్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 19,306.04 కోట్లు కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) సవరించిన అంచనాల కంటే వచ్చే ఆర్థిక సంవత్సరానికి వైద్య, ఆరోగ్య శాఖకు 9.5 శాతం అదనంగా నిధులు(రూ.1,669 కోట్లు) కేటాయించారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారంనాడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేటాయింపు మొత్తం బడ్జెట్లో 5.81% అని, శాఖల వారీగా కేటాయింపుల్లో విద్య, బిసి సంక్షేమం, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తరువాత ఆరోగ్య శాఖకు 4వ స్థానం లభించినట్లు ఆయన వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల మేరకు ఆరోగ్య రంగ బడ్జెట్ రూ.17,637.24 కోట్లు అని తెలిపారు.
విభాగాల (హెచ్ ఓడీలు) వారీగా కేటాయింపులు వచ్చే ఆర్థిక సంవత్సరానికి వైద్య ఆరోగ్య శాఖలో ప్రధాన విభాగాలకు జరిగిన కేటాయింపుల వివరాలు: వైద్య విద్య- రూ.9380.73 కోట్లు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ -రూ.5,352.62 కోట్లు, ప్రజారోగ్య శాఖ (డీపీహెచ్)- రూ.2,582.66 కోట్లు, డైరెక్టరేట్ అఫ్ సెకండరీ హెల్త్ (డీయస్‌హెచ్) -రూ. 1549.11 కోట్లు, ఆయుష్ విభాగం- రూ. 385.25 కోట్లు.

### పథకాల వారీగా కేటాయింపులు..

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు- రూ. 4,000 కోట్లు, ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల అభివృద్ధి- రూ.2,819.31 కోట్లు, మందుల కొనుగోలు- రూ. 600 కోట్లు, 108 సేవలు- రూ.222.24 కోట్లు, 104 సేవలు-రూ.128.89 కోట్లు, ఉద్యోగ ఆరోగ్య భద్రత (ఈహెచ్‌ఎస్)- రూ. 180 కోట్లు, గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డయాగ్నస్టిక్ సేవల కల్పన రూ.127.83 కోట్లు, గిరిజన ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ అనుపత్రుల అభివృద్ధి- రూ.110 కోట్లు, ఎన్టీఆర్ బేబీ కిట్ పథకం పునరుద్ధరణ-రూ.51.15 కోట్లు గత వైకాపా ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపేసిన డాక్టర్ ఎన్టీఆర్ బేబీ కిట్ పథకాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని నిర్ణయించింది

### పి.యమ్ అభిమ్ కింద 98.87% పెరిగిన నిధులు...

ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద ఈ బడ్జెట్‌లో రూ.838 కోట్లు కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సవరించిన బడ్జెట్‌లో రూ.421.38 కోట్లు కేటాయించారు. దీనికంటే 98.87 % (రూ.416.62 కోట్లు) అదనంగా కేటాయించడం గమనార్హం. ఈ నిధులతో క్రిటికల్ కేర్ బ్లాక్ యూనిట్స్, విలేజ్ హెల్త్ క్లినిక్స్, పబ్లిక్ హెల్త్ లాబ్స్ భవన నిర్మాణాలు, ఇతర అభివృద్ధి చర్యలు చేపడతారు.

### రాష్ట్ర బడ్జెటును స్వాగతించిన మంత్రి

స్వర్ణాంధ్ర దిశగా రాష్ట్రం పయనిస్తున్న తరుణంలో ఆ లక్ష్యానికి ఊతమిస్తూ 2026-27 బడ్జెట్లో సాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని, దీన్ని స్వాగతిస్తున్నానని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పేదలు, రైతులు, వెనుకబడిన తరగతులు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు, బడ్జెట్ దోహదం చేస్తుందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ 23,000 కోట్లకు పైగా కేటాయించడంవల్ల సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతాయని మంత్రి తెలిపారు. మూలధన వ్యయానికి రూ.51,000 కోట్లకు పైగా నిధులు సమకూర్చడంతో గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో నిలిచిన పలు అభివృద్ధి పథకాలు ఊపందుకుంటాయని మంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి స్పష్టమైన ప్రతిపాదనలు చేయడం హర్షనీయమని ఈ దిశగా నాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచ ఉద్యాన కేంద్రంగా మార్చడానికి ప్రస్తావించిన ప్రతిపాదనలను ఆయన ప్రత్యేకంగా స్వాగతించారు.

# శ్రీ భీమేశ్వర స్వామివారికి టీటీడీ పట్టువస్త్రాలు సమర్పణ

**- గత 28 ఏళ్లుగా కొనసాగుతున్న**



### టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ పరంపర

వేములవాడ (ప్రశ్న న్యూస్)మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయం శ్రీ భీమేశ్వర స్వామివారికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరఫున పట్టు వస్త్రాల సమర్పణ జరిగింది. టీటీడీ డిప్యూటీ ఈఓ లోకనాథం ఆధ్వర్యంలో అధికారులు ఆలయానికి చేరుకొని స్వామివారికి శనివారం పట్టు వస్త్రాలు సమర్పించారు.టీటీడీ అధికారులు ఆలయానికి రాగానే దేవస్థాన సిబ్బంది పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.అనంతరం మీడియా సెంటర్ వద్ద డిప్యూటీ ఈఓ లోకనాథం మాట్లాడుతూ, టీటీడీ తరఫున వేములవాడ దేవస్థానానికి గత 28 సంవత్సరాలుగా పట్టు వస్త్రాలు సమర్పిస్తున్నామని తెలిపారు. స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, అర్చకులు,దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

# అందరు యోగ నేర్చుకోండి ఆరోగ్యంగా ఉండండి: ఆలే సత్తయ్య

**సమాజానికి నిస్వార్థ సేవగా యోగ సాధన**
**భారత్ స్వామి స్వాభిమాన్ ట్రస్ట్**
**పతాంజలి యోగ దక్షిణ జిల్లా**
**ఆధ్వర్యంలో విశిష్ట సేవలు**





హైదరాబాద్(ప్రశ్న న్యూస్)ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని ఆచరణలో చూపిస్తూ, భారత్ స్వామి స్వాభిమాన్ ట్రస్ట్, పతాంజలి యోగ దక్షిణ జిల్లా ఆధ్వర్యంలో యోగ సేవలు నిరంతరం కొనసాగుతున్నాయి. అధ్యక్షులు అనిల్ నేతృత్వంలో, సీనియర్ యోగ ప్రచారకులు అల్లే సత్తయ్య, యోగ గురు యువభారత్ నరే చారి కలిసి సమాజానికి ఉచితంగా యోగ శిక్షణ అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

### హరిద్వార్‌లో శిక్షణ, సేవకు ప్రేరణ

ఈ యోగ బృందం హరిద్వార్‌లో ప్రత్యేక శిక్షణ పొందింది. యోగ గురువు స్వామి రాందేవ్ బాబా దివ్య ఆశీస్సులతో ప్రజలకు ఆరోగ్య చైతన్యం కల్పించాలనే సంకల్పంతో ముందుకు సాగుతోంది. యోగను ప్రతి ఇంటికీ చేరవేయాలనే లక్ష్యంతో వారు క్రమశిక్షణతో సేవ చేస్తున్నారు.365 రోజులు నిరంతర యోగ శిబిరాలుఈ బృందం సంవత్సరంలో 365 రోజులు యోగ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం విశేషం. ముఖ్యంగావిక్టోరియా ప్లేగ్రౌండ్ మిత్ర క్లబ్‌కారుణ్యభారతి ఆశ్రమంచంద్రాయణ గుట్ట చిత్రగుప్త దేవాలయంలక్ష్మేశ్వర టెంపుల్‌నడికుడా సతీష్ ఫామ్ హౌస్ ఈ ప్రదేశాల్లో యోగ తరగతులు నిర్వహిస్తున్నారు.ప్రతిరోజూ ఉదయం ప్రజలకు యోగాభ్యాసం, ప్రాణాయామం, ధ్యానం వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. ఉచిత సేవలతో ప్రజల ప్రశంసలుఎలాంటి ఫీజులు లేకుండా పూర్తిగా ఉచితంగా ఈ సేవలు అందించడం ప్రత్యేకత. యోగ ద్వారా అనేక మందికి మధుమేహం, రక్తపోటు, ఒత్తిడి వంటి సమస్యల నుంచి ఉపశమనం లభించిందని స్థానికులు చెబుతున్నారు. వృద్ధులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు.

### యోగ ద్వారా ఆరోగ్య విప్లవం లక్ష్యం

ప్రతి ఇంటా యోగ నేర్చుకోవాలి, ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలి" అనే నినాదంతో బృందం ముందుకు సాగుతోంది. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాలకు యోగ శిక్షణ విస్తరించాలని నిర్వాహకులు భావిస్తున్నారు.నిస్వార్థ సేవ భావంతో, గురువు ఆశీస్సులతో, ప్రజల ఆరోగ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఈ యోగ బృందం గురువు అల్లే సత్తయ్య చేస్తున్న కృషి అభినందనీయం. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరం అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. యోగ కోసం ఎవరైనా సంప్రదించాలి అనుకుంటే ఈ కింది ఫోన్ నెంబర్ కు ఫోన్ చేయండి: 9490 99 5238.

# భక్తి సేవలో మన చారిటబుల్ ట్రస్ట్

**- మహా అన్నదాన సేవలకు శ్రీకారం**
**- గత 15 ఏళ్లుగా కొనసాగుతున్న అన్నదాన సేవా కార్యక్రమాలు**
**- వేలాది రాజన్న భక్తులకు ఉచిత అన్నప్రసాదం అందిస్తున్న "మన చారిటబుల్ ట్రస్ట్"**



**- అన్నార్థుల ఆకలి తీర్చడమే సేవగా భావిస్తున్నాం - మన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు**

వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడకు విచ్చేసే రాజన్న భక్తుల కోసం "మన చారిటబుల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. లక్ష్మీ గణపతి కాంప్లెక్స్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయాల చైర్మన్ సత్యనారాయణ గౌడ్, మాజీ జిల్లా బీజేపీ అధ్యక్షులు ప్రతాప రామకృష్ణలతో కలిసి దేవస్థానం ఈఓ రమాదేవి ప్రారంభించారు.పట్టణ పలువురు ప్రముఖులు, దాతలు ఈ కార్యక్రమంలో పాల్గొని ట్రస్ట్ సేవలను సేవలను అభినందించారు.ఈ సందర్భంగా మన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూఅన్నదానం ద్వారా భక్తులకు సేవ చేయాలనే లక్ష్యంతో 15 ఏళ్ల క్రితం "వాసవి సేవా సమితి" ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని గత నాలుగేళ్లుగా "మన చారిటబుల్ ట్రస్ట్" కొనసాగిస్తోందన్నారు.మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు సుమారు 25 వేల మందికి పైగా భక్తులకు భోజనం వడ్డించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.సుదూర ప్రాంతాల నుంచి దర్శనానికి వచ్చే భక్తులకు ఈ

# మహా శివరాత్రి జాతరకు వేములవాడ సిద్ధం...

## భక్తుల సేవలో అధికార యంత్రాంగం

**- సౌకర్యాలే ప్రధానం... సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు**
**- బేబీ ఫీడింగ్ నుంచి మెడికల్ సదుపాయాల వరకు ప్రత్యేక దృష్టి**
**- సైన్‌బోర్డులు, వీల్‌చైర్లు, హెల్ప్‌డెస్క్‌లతో భక్తులకు సులభతరం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని భక్తులకు ఇబ్బందులు లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నారు. భారీగా రానున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సమాచారం, భద్రత, పారిశుధ్యం, వైద్య సేవలు తదితర అంశాల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పర్యవేక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాయి. జాతర ప్రాంగణంలో దర్శన మార్గాలు, క్యూలైన్లు, త్రాగునీటి పాయింట్లు, మరుగుదొడ్లు, హెల్ప్‌డెస్క్‌లు వంటి సదుపాయాలను భక్తులు సులభంగా గుర్తించేందుకు స్పష్టమైన తెలుగులో సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు.



### - తల్లుల కోసం బేబీ ఫీడింగ్ కేంద్రాలు



శిశువులతో వచ్చే తల్లుల సౌకర్యార్థం ప్రత్యేక బేబీ ఫీడింగ్ గదులను ఏర్పాటు చేశారు. పరిశుభ్రమైన వాతావరణం, గోప్యత, కూర్చునే సదుపాయాలతో ఈ కేంద్రాలు సిద్ధంగా ఉంచారు.

### - దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక సహాయం

వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది లేకుండా దర్శనం చేసుకునేలా సుమారు 100 వీల్‌చైర్లు అందుబాటులో ఉంచారు. ప్రవేశ ద్వారాలు, ముఖ్య కేంద్రాల వద్ద సిబ్బంది సహాయానికి సిద్ధంగా ఉన్నారు.

### పర్యావరణానికి ప్రాధాన్యం

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ త్రాగునీటికి స్టీల్ గ్లాసులను ఉపయోగిస్తున్నారు. వీటి శుభ్రతపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోంది.

### - హెల్ప్‌డెస్క్‌ల ద్వారా సమాచారం

దర్శన సమయాలు, వసతి, వైద్య సేవల వివరాల కోసం 10 హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. భక్తుల సందేహాలకు తక్షణ స్పందన అందేలా సిబ్బందిని నియమించారు.

### పారిశుధ్యం, వైద్య సన్నద్ధత

జాతర ప్రాంతంలో పారిశుధ్య పనులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. చెత్త తొలగింపుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల కోసం వైద్య శిబిరాలు, అగ్నిమాపక సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.

### సీసీ కెమెరాలతో నిఘా

భక్తుల రాకపోకలు, క్యూలైన్ల పరిస్థితిని సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. ఏ సమస్య తలెత్తినా వెంటనే స్పందించేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంది.
ఈ మహాశివరాత్రి జాతరలో భక్తులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

# రైల్వేకోడూరు ఎమ్మెల్యే వివాదం..

## మరో వీడియో విడుదల

రైల్వేకోడూరుకు చెందిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై ఆరోపణలు చేసిన బాధితురాలు మరో వీడియోను విడుదల చేశారు.ఆ వీడియోలో ఆమె మాట్లాడుతూ "నేను ఎక్కడా దాక్కోలేదు.పూర్తిగా లీగల్ ప్రొసీజర్లోనే ముందుకెళ్తున్నాను. కమిటీ ముందు హాజరు కావాలని ఎవరూ నన్ను పిలవలేదు. సమాచారం కూడా ఇవ్వలేదు. శివశంకర్కు పెన్డ్రైవ్, లేఖ పంపుతున్నట్లు ఫోన్లో తెలియజేశాను. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసి పూర్తి వివరణ ఇవ్వాలని అనుకుంటున్నానని పేర్కొన్నారు.

# ఎర్రచందనం ముద్దాయిలు ఇద్దరిపై పీడీ యాక్ట్

## ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న టాస్క్ ఫోర్స్



సయ్యద్ ఫైరోజ్ @ ఫైరోజ్ @ సయ్యద్ @ ఫైరు




రాజశేఖర్ @ రాజబాబు @ బూసి రాజశేఖర్

తిరుపతి ఎర్రచందనం అక్రమ రవాణాకు చెందిన పలు కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న కర్నాటక కు చెందిన సయ్యద్ ఫైరోజ్ ఎలియాస్ ఫైరోజ్ ఎలియాస్ సయ్యద్ ఎలియాస్ ఫైరు (38), చిత్తూరు జిల్లాకు చెందిన రాజశేఖర్ ఎలియాస్ రాజా బాబు ఎలియాస్ బూసి (33)లపై టాస్క్ ఫోర్స్ అధికారులు పీడీ యాక్ట్ అమలు చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడమే కాకుండా, ఎక్కువ కేసుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్ కు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ లు అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇద్దరు ముద్దాయిలు సయ్యద్ ఫరోజ్ ఎలియాస్ ఫైరోజ్ ఎలియాస్ ఫైరు, రాజశేఖర్ ఎలియాస్ రాజబాబు ఎలియాస్ బూసి లపై పీడీ యాక్ట్ అమలుకు టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు సిఫారసు చేశారు. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, వీరిపై పీడీ యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరూ ఎర్రచందనం కొల్లగొట్టడుతూ, వన్య మృగాల చట్టాలను ఉల్లంఘించి నేరాలు చేస్తూ ప్రజాజీవనానికి అటంకం కలిగిస్తున్నట్లు గుర్తించారు. పీడీ యాక్ట్ అమలులో భాగంగా నిందితులను కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధకంలో భాగంగా పీడీ యాక్ట్ అమలు చేయడానికి వెనుకాడబోమని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ హెచ్చరించారు. ఎర్రచందనం కేసుల్లో ఇప్పటికే అనేక మందికి శిక్షలు పడ్డాయని గుర్తు చేశారు. యువత ఎర్రచందనం అక్రమ రవాణాకు ప్రయత్నించి వారి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని చెప్పారు.

# బెల్లంపల్లిలో బీఆర్ఎస్కు మరింత బలం..

## పార్టీలో చేరిన పలువురు కౌన్సిలర్లు!



బెల్లంపల్లి బెల్లంపల్లి మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. బెల్లంపల్లికి చెందిన పలువురు కౌన్సిలర్లు శనివారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబీ గూటికి చేరారు. పార్టీలో చేరిన వారికి కేటీఆర్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. 30వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ శంకర్ సింగ్ తో పాటు, కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన 26వ వార్డు కౌన్సిలర్ కుమారస్వామి అధికారికంగా బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్నారు. వీరితో పాటు బీజేపీకి చెందిన 34వ వార్డు అభ్యర్థి రామూర్తి కూడా కేటీఆర్ను కలిశారు. ఆయన ప్రస్తుతానికి పార్టీలో అధికారికంగా చేరనప్పటికీ, బీఆర్ఎస్ విధానాలకు ఆకర్షితులై పార్టీకి పూర్తి స్థాయి మద్దతును ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ చేరికల వల్ల బెల్లంపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ మరింత బలోపేతం కానున్నది.

# వైభవంగా శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుస్వామి స్నపన తిరుమంజనం

తిరుపతి శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలోని కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లకు శనివారం స్నపన తిరుమంజనం (పవిత్రస్నానం) శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రధాన కంకణభట్టర్ శ్రీ బాలాజి రంగాచార్యులు ఆధ్వర్యంలో ఈ విశేష ఉత్సవం నిర్వహించారు. ఇందులో ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపట్టారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, పెరుగు,తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. ఈ సందర్భంగా తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, పంచశాంతి మంత్రములు, దివ్యప్రభందములోని అభిషేక సమయంలో అనుసంధానము చేసే పాశురాలను అర్చకులు పఠించారు. ఈ వేడుకలో ఒకో క్రతువులో ఒక మాల వంతున తామర పూలు, రోజా, తామర గింజలు, వివిధ రకాల సాంప్రదాయ పుష్పాలు, తులసీ తదితర ఏడు రకాల మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు.

# మానవతా నాగేశ్వరరావు అనుమానస్పద మృతి



ఏలూరు ఏలూరు నగరంలో తన ఇంటి పేరుని తాను నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ పేరుగా మార్చుకున్న ఆలపాటి నాగేశ్వరరావు అలియాస్ మానవతా నా గే శ్వ ర రా వు అనుమానాస్పద మృతి చెందారు. ఈ నెల 9వ తేదీన ఉదయం వసంతం మాల్ సెంటర్లో ఆయన నిర్వహిస్తున్న గాయత్రి ఫైనాన్స్ నుండి బయటికి వెళ్తున్న అని బయలుదేరిన ఆయన ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లారు. దీంతో కంగారు పడ్డ ఆయన భార్య టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ ఆయన ఆచూకీ కోసం రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలలో ఆయన నూజివీడు వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో ఆయన ఆచూకీ కనిపెట్టడం మరింత కష్టమైంది అయితే ఈరోజు ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ గన్నవరం పోలీస్ స్టేషన్ లిమిట్స్ మధ్య ఉన్న చెరువులో ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు ప్రస్తుతం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించే పనిలో నిమగ్నంగా ఉన్నారు మీా మృతదేహం దొరికిన సమీపంలోనే ఆయన ప్రయాణించిన వాహనం లభించడంతో ఇది ఆయనేనని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఉపవాసదీక్షతో అంతఃకరణశుద్ధి, ఇంద్రియాల క్రమశిక్షణ సాధ్యం



సకల చరాచర సృష్టికి లయకారకుడు అయిన పరమేశ్వరుడు భక్తుల పాలిట పెన్నిధి. ఆ భోళా శంకరుడైన త్రినేత్రుడు లింగోద్భవం చెందిన రోజే మహా శివరాత్రి పర్వదినంగా జరుపుకుంటారు. మహాశివరాత్రి సందర్భంగా మనసా వాచా పరమేశ్వరుని స్మరిస్తే జాగారంతో దైవ సన్నిధి అనుభూతిని చెందడమే శివరాత్రి పండగ పరమార్థం. మహాశివరాత్రి అంటే కేవలం పండగే కాదు. ఇది ఆత్మ జాగారణకు దారి చూపే పవిత్రమైన రోజు. ఇంతటి పవిత్రమైన రోజున ప్రతి ఒక్కరు బాహ్య ప్రపంచాన్ని వదిలి తమ అంతరంగంలో నిక్షిప్తమైన శివతత్వాన్ని పొందాలి. ముఖ్యంగా మహా శివరాత్రి
రోజు ఉపవాసం, జాగరణతో పరమేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించాలి. ఇతర పండుగలతో పోల్చుకుంటే మహాశివరాత్రికి ఒక ప్రత్యేకత ఉంది. రాత్రివేళ పూజలు ఆచరించడం, జాగరణ చేయడం ఈ శివరాత్రి పండుగ ప్రత్యేకత. శివరాత్రి రోజు శివుడికి బిల్వ పత్రార్చనలు, రుద్రాభిషేకాలు, రుద్రాక్ష మాలధారణలు, విభూతిదారణతో శివరాత్రి రోజు ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అయితే శివరాత్రి నాడు అభిషేకాలతో, రుద్రాభిషేకంతో శివుడిని పూజించడంతో ఆనేక ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఉన్నాయని లింగపురాణంలో పేర్కొన్నారు.

### లింగోద్భవం

మాఘ మాసం కృష్ణ పక్షం, చతుర్దశి తిథి రాత్రివేళ లింగోద్భవం జరిగినట్లు స్కాంద, తదితర పురాణ గ్రంథాలు తెలియజేస్తున్నాయి.
బ్రహ్మ విష్ణువులకు తన ఆధిక్యాన్ని తెలియజేయడం కోసం శివుడు జ్యోతి రూపంలో ఒక స్తంభంగా అంతు తెలియనంతగా, ఆద్యంతాలు కనిపించనంతగా పైకీ, క్రిందికీ వ్యాపించాడనీ, బ్రహ్మ విష్ణువులు లింగం ఆది, అంతం ఎక్కడో తెలుసుకొనలేనప్పుడు శివుడు అగ్ని స్తంభం మధ్యలో వారికి దర్శనం ఇచ్చాడనీ పురాణ గాథ. అదే రోజు మహాశివరాత్రి పర్వదినంగా పాటించడం సంప్రదాయం.

### జాగారం

మహాశివరాత్రి రోజు నిద్ర పోకుండా జాగరణ చేయాలి అని, ఉపవాసం చేయాలని పురాణాలలో పేర్కొన్నారు. ఇక్కడ నిద్ర అంటే, భగవత్ స్వరూపమైన ఆత్మ పరమార్థాన్ని తెలుసుకోక పోవడమే నిద్ర. అంటే ఆత్మ తత్వాన్ని ఉన్నది ఉన్నట్లు తెలుసుకోకుండా దానిని దేహం, మనస్సు, ఇంద్రియాలని తప్పుగా తెలుసుకోవడమే స్వప్నం. ఈ రెండు నిర్వచనాల వల్ల యధార్థ గ్రహణమే జాగ్రత్త (మెలకువ). అంటే తన స్వరూపాన్ని ఉన్నది ఉన్నట్లు తెలుసుకోవడమే జాగరణం. ఆ రోజే మన జీవితంలో శివరాత్రి. పరమ కరుణామూర్తి స్వరూపులైన గురువుల ఆత్మోపదేశంతో అనాది పేరుకుపోయిన మాయానిద్ర తొలగి, అజం, అనిద్రం, అస్వప్నం, అద్వైతం అయిన తన ఆత్మ స్వరూపాన్ని తెలుసుకోవడమే నిజమైన జాగరణ. ఉప అంటే దగ్గర, జీవాత్మ పరమాత్మకు సమీపంలో ఉండడం, గురువుల వద్ద శ్రవణం చేసి తన ఆత్మ పరమాత్మయే అని గుర్తించడమే నిజమైన ఉపవాసం. అంతేగాని శరీరం ఎండబెట్టడం ఉపవాసం కాదు. అయితే శివరాత్రి రోజు ఆహారం స్వీకరించకుండా ఉపవాసం చేస్తే అది ఆరోగ్యానికి, అంతఃకరణశుద్ధికి ఉపయోగం కాని ఇదే పరమార్థం అనుకోకూడదు. మహా శివరాత్రి నాడు ఉపవాసం వల్ల శరీరాన్ని శుద్ధి చేసి, ఇంద్రియాలను క్రమశిక్షణలో ఉంచుతుంది, రాత్రంతా మేల్కొని ఉండటం వల్ల మనస్సు అప్రమత్తంగా ఉంటుంది. శివునిపై దృష్టి కేంద్రీకరిస్తుంది. కలిసి, భక్తుల శారీరక అవసరాలను అధిగమించి, ఆధ్యాత్మిక అవగాహన, స్వీయ నియంత్రణ, దైవిక స్పృహతో లోతైన సంబంధం కోసం అంతర్గతంగా సిద్ధం కావడానికి ఇవి సహాయపడతాయి.

### లింగాభిషేకం

అభిషేకం అంటే శివలింగం యొక్క పవిత్ర స్నానం, ఇది ఆత్మ యొక్క శుద్ధిని సూచిస్తుంది.
**నీరు:** ఆలోచనలను శుద్ధి చేసుకోవడాన్ని, ప్రతికూలతను త్యజించడాన్ని సూచిస్తుంది.
**పాలు:** స్వచ్ఛత, పవిత్రత, భక్తికి ప్రతీక.
**తేనె:** మాటల్లో, చర్యలలో, సంబంధాలలో మాధుర్యాన్ని సూచిస్తుంది.
**గంటానాథం** శివుని పట్ల శరణాగతి, అహంకార రద్దు, భక్తికి గుర్తుగా సమర్పించబడుతుంది.
ఈ ఆచారం భక్తులకు శరీరం, మనస్సు, ఆత్మను శుద్ధి చేసుకోవాలని గుర్తుచేస్తుంది. శివుని పాదాల వద్ద అహాన్ని అర్పించాలి.
**మంత్రం - ప్రార్థనలు**
"ఓం నమః శివాయ"
అనేది కేవలం ఒక మంత్రం కాదు.
ఇది భక్తుడికి అన్ని రూపాలో లోపల, వెలుపల ఉన్న అపరిమిత చైతన్యానికి లోబడి ఉండటానికి, అహాన్ని కరిగించడానికి శ్వాసను అవగాహనతో అనుసంధానించడానికి బోధిస్తుంది.

### శివరాత్రి కథా విశిష్టత

ప్రకృతిలో దైవాజ్ఞ లేనిదే ఏమి జరగదనే విషయం తెలిసిందే. ఎంతో పవిత్రమైన మహాశివరాత్రి రోజు భక్తులు ఉపవాసాలు, జాగరణాలు, రుద్రాభిషేకాలు, రుద్రాక్ష మాలధారణలు, విభూతి ధారణతో కఠినమైన భక్తి శ్రద్ధలతో పూజలు ఆచరిస్తే ఆ పరమేశ్వరుడి అనుగ్రహం కలుగుతుందని విశ్వసిస్తారు. మహాశివరాత్రి పూజ, వ్రతం విశిష్టతను సాక్షాత్తు ఆ పరమేశ్వరుడే పార్వతిదేవికి తెలియచేయడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. పూర్వం ఒక ఒక బోయవాడు వేటనే వృత్తిగా ఎంచుకోని ప్రతిరోజూ ఉదయాన్నే వేటకు వెళ్లి సాయంత్రానికి ఏదో ఒక జంతువుని చంపి దానితో కుటుంబాన్ని పోషించుకోవడం దినచర్య మార్చుకున్నాడు. అయితే ప్రతిరోజు లాగే ఒక రోజు ఉదయాన్నే వేటకు వెళ్లాడు. అయితే సాయంత్రం చీకటి పడుతున్నను ఒక్క జంతువు కూడా దొరకలేదు. దాంతో ఎంతో నిరాశగా ఇంటిముఖం పట్టాడు. ఇంటికి వస్తున్న క్రమంలో దారిలో అతడికి ఒక సరస్సు కనిపించింది. వెంటనే అతని ఒక ఆలోచన వచ్చింది.
రాత్రి సమయం కదా ఏదో ఒక జంతువు నీళ్లు తాగడానికి సరస్సు దగ్గరికి వస్తుందని, అప్పుడు వాటిని వేటాడొచ్చని భావించి ఆ సరస్సు పక్కనే ఉండే ఒక చెట్టు పైకి ఎక్కి కూర్చున్నాడు. సరస్సు వైపు గమనించే క్రమంలో తన కంటి చూపుకు అడ్డంగా కొన్ని కొమ్మలు ఉండటంతో ఆ కొమ్మ ఆకులను తుంచి కిందపడేసి ఆ చెట్టుపై జంతువుల కోసం మాటువేసి కూర్చున్నాడు. అయితే ఖాళీగా కూర్చోకుండా నిత్యం ఊతపదంగా మారిన శివ శివ అంటు సమయం గడుపసాగాడు. కానీ ఆరోజు మహాశివరాత్రి పర్వదినమనే విషయం అతనికి తెలియలేదు.
అలా ఆ రాత్రి కొంత సమయం గడిచాక ఒక ఆడ జింక నీళ్లు తాగడానికి ఆ సరస్సు వైపు వచ్చింది. వెంటనే బోయవాడు ఆ జింకకు బాణాన్ని ఎక్కుపెట్టాడు. అది గమనించిన ఆ జింక తాను గర్భం దాల్చానని తనను చంపకుండా వదిలి పెటాలని ప్రాధేయపడింది. మామూలుగా అయితే ఆ బోయవాడు ఎంతో క్రూర స్వభావం కలిగిన వ్యక్తి. కానీ ఆ జింక పరిస్థితిని చూసిన బోయవాడు దానిని ఏమీ చేయలేక వదిలిపెట్టాడు. మళ్లీ చెట్టు ఎక్కి కూర్చున్నాడు. మరికొంత సమయం గడిచింది. అప్పుడు మరో ఆడ జింక అటుగా వచ్చింది. దానిని వేటాడుదాం అనుకునేలోపే ఆ జింక కూడా మానవ భాషలో నేను నా భర్తను వెతుకుతు విరహంతో కృశించిపోయి ఉన్నానని నా బక్కచిక్కిన శరీర మాంసంతో మీ కుటుంబానికి ఆకలి తీరదు కాబట్టి నన్ను విడిచిపెట్టమని కోరింది. అంతే కాకుండా మరికొంత సమయం వేచి చూడు ఏ జంతువు రాకపోతే నేనే తిరిగి వస్తాను అప్పుడు సంహరించు అని వేడుకుంది. అలా ఆ జింకను కూడా విడిచి పెట్టాడు. అలా మరికొంత సమయం గడిచేసరికి ఒక మగ జింక అక్కడికి వచ్చింది. ఇదే సరైన సమయం అని భావించి ఆ మగ జింకను బాణంతో సంహరించుదాం అనుకునే సమయానికి అది కూడా మాట్లాడుతు రెండు ఆడజింకలు ఈవైపు వచ్చాయా అని బోయవాడిని అడిగింది. అప్పుడు బోయవాడు అవును వచ్చాయి తనకు ఈరోజు ఏ జంతువు దొరకకపోతే తామే వస్తామని కూడా చెప్పినట్లు ఆ మగ జింకకు చెబుతాడు. అవునా అయితే ఆ రెండు ఆడజింకలను ఒకసారి చూసుకొని వస్తానని ఆ తర్వాత నన్ను సంహరించమని చెప్పి వెళ్లిపోయింది. ఇంతలో తెల్లవారుజామున సూర్యోదయం సమయం ఆసన్నమైంది. ఇక ఆ బోయవాడికి వస్తామని మాటిచ్చి వెళ్లిన మూడు జింకల కోసం ఆశగా ఎదురుచూస్తూ ఆ చెట్టుమీదనే కూర్చున్నాడు. ఇంతలో మరొక జింక తన పిల్లతో రావటం కనిపించింది. దీనిని సంహరిద్దామని విల్లు ఎక్కుపెట్టగా ఆ జింక కూడా తన బిడ్డను ఇంటి దగ్గర విడిచిపెట్టి వస్తానని అప్పటి వరకు ఆగాలని చెప్పేసి వెళ్లింది. అలా మరికొంత సమయం గడిచేసరికి ఆ నాలుగు జింకలు బోయవాడికి ఇచ్చిన మాట ప్రకారం సత్యనిష్ఠతో అక్కడికి రావడమే కాక మొదట తనను చంపమంటే తనను చంపాలంటు బోయవాడిని ప్రాధేయపడ్డాయి. ఆ సన్నివేశంతో కఠిన మనస్కుడైన ఆ బోయవాడి మనసులో పరివర్తన వచ్చింది. అయితే ఆ రాత్రంతా బోయవాడు కూర్చున్నది మారేడు చెట్టుకావటం, అతడికి తెలియకుండానే శివ శివా అని శివనామస్మరణ చేయడం తన కంటికి అడ్డువచ్చిన మారేడు దళాలను కోసి కింద పడవేయటంతో ఆ చెట్టు కింద ఉన్న పాతకాలం నాటి ఓ శివలింగంపై పడడం, వేట కోసం నాలుగు జాములు మెలుకువతో ఉండటం అతనికి తెలియకుండానే జాగరణ ఫలితం దక్కింది. ఎంతో క్రూరాత్ముడు అయినప్పటికీ అతను చేసిన పుణ్యకార్యాల వల్ల అతడికి తెలియకుండానే మనస్సు నిర్మలమైంది. పైగా ఆ నాలుగు జింకలు సత్యనిష్ఠతో తిరిగిరావడం అతడి మనస్సును పూర్తిగా మార్చివేసింది. అందులోను ఆ రోజు మహాశివరాత్రి. ఆరోజు మహాశివరాత్రి పర్వదినం అని అతనికి తెలియకపోయినా అనుకోకుండా చేసిన పుణ్యకార్యాల వల్ల అతడిలో సత్ప్రవర్తన కలిగింది. అప్పటి నుంచి హింసను విడిచి సన్మార్గంలో జీవనం సాగించాడు. ఆ జింకలు సైతం సత్యనిష్ఠతో ఉండటంతో పరమేశ్వరుడి అనుగ్రహం వల్ల ఆకాశంలో మృగశిర నక్షత్రంగా మారగా ఆ బోయవాడు సైతం మృగశిర నక్షత్రానికి వెనుక ఉజ్వలంగా ప్రకాశిస్తు లుబ్ధక నక్షత్రం అనే పేరుతో నిలిచిపోయాడు. హింసకు పాల్పడే ముందు ఒక్కక్షణకాలం పాటు ఆగి ఆలోచిస్తే మనసు ఆ ఆలోచన నుంచి మరలుతుంది. బోయవాడు విషయంలో కూడా అదే జరిగింది. జింకలను చంపాలని అనుకోవడంలో జరిగిన కాలయాపన అతడిని చివరకు అహింసామూర్తిగా, ధర్మాచరణమూర్తిగా నిలిపింది. సత్యం, అహింసా మార్గాన్ని అనుసరించిన వారు స్థిరమైన కీర్తితో నిలిచిపోతారనే సందేశం ఈ శివరాత్రి కథ సారాంశం.



**రవికుమార్ సంతోజు**
**బడంగ్ పేట్. రంగారెడ్డి (జిల్లా)**

# పిఆర్సీ సాధనకై పోరు తీవ్రతరం

**-ఈనెల 17న ఛలో విజయవాడ జయప్రదం చేయండి.**
**-రణభేరిలో యుటిఎఫ్ నేతలు బి.లక్ష్మీరాజా, మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు**

బద్వేలు 12వ పిఆర్సీ అమలు, పెండింగ్ డిఏ ల విడుదల, ఆర్థిక బకాయిల సాధన కోసం పోరు తీవ్రతరం చేస్తామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు హెచ్చరించారు. రణభేరి 2.0 కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 17వ తేదీ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జీపు జాత కడప జయనగర్ కాలనీలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చేరుకుంది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 మాసాలు పూర్తవుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి పెద్దలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదన్నారు. 12వ పిఆర్సీ గడువు ముగిసి మూడేళ్లవుతున్నా , పిఆర్సీ అమలుకు ప్రయత్నించకపోవడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరిని తేటతెల్లం చేస్తున్నదన్నారు. వైసీపీ హయాంలో నియమించిన పిఆర్సీ చైర్మన్ డాక్టర్.మన్మోహన్ సింగ్ తన బాధ్యతలకు రాజీనామా చేసినప్పటికీ నూతన చైర్మన్ ను నియమించకపోవడం తగదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలను అమలు చేయడంతో పాటు, ఆర్థిక బకాయిలన్నిటినీ ఆరు మాసాలలోగా చెల్లిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ వైపుగా కనీసం ఆలోచించకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఉద్యోగులకు ఎనిమిది వేల కోట్ల రూపాయల బకాయిలను మాత్రమే చెల్లించి, ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్న కూటమి ప్రభుత్వం ఇంకా 35 వేల కోట్ల రూపాయల బకాయిల్ని చెల్లించే విషయాన్ని విస్మరించిందన్నారు. ఆర్థిక బకాయిల చెల్లింపులపై రోడ్డు మ్యాప్ ప్రకటించి నిర్ణీత గడువులోగా అన్ని రకాల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. డి.ఏ లను ఎప్పటికప్పుడు చెల్లిస్తామని ఇచ్చిన హామీ మేరకు నాలుగు డిఏలు చెల్లించాల్సి ఉండగా, ఒక్క డిఏ మాత్రమే చెల్లించి చేతులు దులుపుకోవడం తగదన్నారు. ఒక్క డిఏ చెల్లింపు కోసం సైతం ముఖ్యమంత్రి స్థాయిలో సంఘాలు చర్చించాల్సి రావడం దారుణమన్నారు. సరెండర్ లీవ్ బకాయిలను నాలుగేళ్లుగా చెల్లించడం లేదన్నారు. జీతం మాత్రం ఒకటవ తేదీ చెల్లిస్తే చాలన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే విషయంలో ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ఆర్భాటంగా ప్రకటించుకుంటున్న పాలకులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో మాత్రం ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని బీద అరుపులు అరుస్తున్నారని విమర్శించారు. తక్షణం నూతన పిఆర్సీ ని ఏర్పాటుచేసి, పిఆర్సీ అమలయ్యే వరకు 29 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 17వ తేదీ చేపట్టబోయే ఛలో విజయవాడ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రాజశేఖర్ రాహుల్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహమ్మద్, డి.సుబ్బారావు, ఎ.డి.దేవ దత్తం, కె.సుధాకర్, పి.వెంకటసుబ్బయ్య, కడప నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హిఫాజితుల్లా, కరీముల్లా, ట్రెజరర్ మేరీ ప్రసన్న, కడప మండల ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



## సేవాలాల్ మహారాజ్ చూపించిన మార్గం

# అందరికీ ఆదర్శనీయం



ఓయు (ప్రశ్న న్యూస్) బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవలాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా తెలంగాణ గిరిజన శక్తి అధ్యక్షుడు శరత్ నాయక్ ఆధ్వర్యంలో ఓయూ ఎన్సిసి గేట్ నుండి ఆర్ట్స్ కళాశాల వరకు 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా మాజీ వైస్ ఛాన్స్ లర్, టీజీపీఎస్సీ సభ్యులు ప్రో. లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ తన బోధనల ద్వారా బంజారా జాతి అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు,తండాల నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు, హింస,చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితువు పలికి యావత్ ప్రజానీకానికి ఆదర్శంగా నిలిచారన్నారు. బంజారా జాతిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చిన ఒక విప్లవ చైతన్య మూర్తి అని, దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మికవేత్త, సమాజ శ్రేయస్సు కోసం సంత్ సేవాలాల్ మహారాజ్ చూపించిన మార్గం అందరికీ ఆదర్శనీయమన్నారు. రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్ మాట్లాడుతూలి సేవాలాల్ మహారాజ్ తన బోధనల వల్ల బంజారా జాతి పురోగమించడానికి కృషి చేశారని పేర్కొన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో మనమందరం పయనించి ఆయన ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు, సేవలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా జాతీయ సెలవుదినంగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, బంజారాలు మాట్లాడే గోర్ బోలి భాషను 8వ షెడ్యూల్లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టూటా ప్రధాన కార్యదర్శి ప్రో. శ్రీను నాయక్, ఎలక్ట్రికల్ డీఈలు అమర్ సింగ్, బాలాజీ నాయక్,భీమ్లా నాయక్, డా.కరాటే రాజు నాయక్, ఎస్ఐ జవేందర్ నాయక్, తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బు నాయక్, చీఫ్ కోఆర్డినేటర్ రమేష్ రాథోడ్, ఎల్ ఎస్ ఓ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ నాయక్, ప్రధాన కార్యదర్శులు విజయ్ నాయక్, నరేష్ నాయక్, టిజిఎస్ రాష్ట్ర నాయకులు సతీష్ నాయక్, హనుమంతు నాయక్, లక్ష్మణ్ నాయక్, రాజశేఖర్ నాయక్, ప్రేమ్ సింగ్, నరేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## 2026-27 ఆర్థిక సంవత్సరానికి

# రూ.3,32,205 కోట్లతో బడ్జెట్

**విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపించే విధానం**

**పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**



అమరావతి (ప్రశ్న న్యూస్)ఆంధ్రప్రదేశ్ లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.3,32,205 ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మూడోసారి ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ గాడి తప్పిన వ్యవస్థను ఆర్థిక సంక్షోభం నుంచి పురోగతి వైపు, విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపించే విధంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మూలధన వ్యయం విషయంలో గత సంవత్సరం రూ.39,498 కోట్ల నుండి 16 శాతం పెంచి రూ.53,917 కోట్లకు చేర్చడం ప్రభుత్వం అభివృద్ధి పట్ల చూపుతున్న నిబద్ధతకు నిదర్శనమని నాదెండ్ల మనోహర్ తెలిపారు.పన్నుల ద్వారా రెవెన్యూ వసూళ్ళు గత సంవత్సరం రూ.98,025 కోట్ల నుండి రూ.1,25,846 కోట్లకు పెరగడం రాష్ట్ర ఆర్థిక పునరుద్ధరణలో జరుగుతున్న నిరంతర కృషికి రుజువని ఆయన అన్నారు. సంక్షేమ రంగంలో సూపర్ సిక్స్ పథకాలకు ఎటువంటి రాజీ లేకుండా నిధులు కేటాయించడం, ముఖ్యంగా దీపం పథకం, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి కార్యక్రమాలను నిరంతరాయంగా అమలు చేస్తున్న తీరు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. గత ఐదేళ్ళలో విధ్వంసమైన రాష్ట్రాన్ని 19 నెలల్లోనే పురోగతి పథంలో పెట్టగలిగిందని నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. ఈ సమగ్ర పురోగమన బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కి జనసేన పార్టీ తరపున మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.

# భారతదేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య

**క్రమశిక్షణతో కూడిన విద్యతో**

**ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు జాయింట్ కలెక్టర్**



తిరుపతి(ప్రశ్న న్యూస్ )దామోదర సంజీవయ్య క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడంతో పాటు రాజకీయరంగంలో తనదైన ముద్ర వేశారని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు పేర్కొన్నారు. శనివారం దామోదర సంజీవయ్య 105 వ జయంతి కార్యక్రమంలో భాగంగా జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జాయింట్ కలెక్టర్ తో పాటు డిఆర్ఓ నరసింహులు, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా జేసి దామోదర సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జే సి మాట్లాడుతూ దామోదర సంజీవయ్య భారతదేశంలోనే మొదటి దళిత ముఖ్యమంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రి గా పని చేశారన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం, తద్వారా విలువలతో కూడిన రాజకీయ నాయకుడిగా ఎదగడంతో 38 సం.ల అతి చిన్న వయసులోనే ముఖ్యమంత్రిగా అయ్యారన్నారు. నిబద్ధత, విలువలతో కూడిన రాజకీయ నాయకుడైన దామోదర సంజీవయ్య ను ప్రజలందరూ గుర్తుంచుకోవాలని భావించి ఆయన జన్మదిన వేడుకలను నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. విద్యతో అభివృద్ధి సాధ్యమని డా.బి.ఆర్.అంబేద్కర్ నమ్మేవారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఖచ్చితంగా చదివించాలని, విలువలు, క్రమ శిక్షణతో కూడిన విద్య ను అభ్యసించడం ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోగలమని, తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపాలని కోరారు.ఈ కార్యక్రమానికి నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.సదాశివం, సుప్రీం కోర్టు అడ్వకేట్ నాగపట్ల రాజా గోపాలు, ఎస్ వి యూనివర్సిటీ ఎంప్లాయీస్ యూనియన్ నుండి పరమశివం, ఎస్ సి అసోసియేషన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి రోజున 1.50 లక్షల మంది

# భక్తుల దర్శనానికి విస్తృత ఏర్పాట్లు

**కలెక్టర్ రాజకుమారి గణియా**



శ్రీశైలం (ప్రశ్న న్యూస్ )మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివరాత్రి రోజున సుమారు 1.50 లక్షల మంది భక్తులు శ్రీశైలానికి తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల దృష్ట్యా ఆలయ ప్రాంగణం పరిసర ప్రాంతాలను ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శివరాత్రి రోజున సుమారు 20 గంటల వ్యవధిలో భక్తులు ప్రశాంతంగా, సౌకర్యవంతంగా దర్శనం చేసుకునే విధంగా సమగ్ర ప్రణాళిక అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు అర్ధగంట వ్యవధిలోనే శ్రీ శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం లో స్వామివారి, అమ్మవార్ల దర్శనం పూర్తి చేసుకునేలా క్యూలైన్లు, భద్రతా ఏర్పాట్లు, ప్రసాద పంపిణీ వ్యవస్థలను సమర్థవంతంగా ఏర్పాటు చేశామని తెలిపారు. దర్శనం అనంతరం భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. శుక్రవారం రోజున దాదాపు 80 వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకోవడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వామివారి ప్రసాదం, దేవస్థాన భోజన వసతి అందించి సాఫీగా నిర్వహించగలిగామని కలెక్టర్ వివరించారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు భక్తులు ఇదే విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే దృష్ట్యా టోల్ గేట్ రుసుము మినహాయింపు, రాత్రి వేళల్లో ప్రయాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. అటవీ మార్గంలో పాదయాత్రగా వచ్చే భక్తుల సౌకర్యార్థం 13 ప్రాంతాల్లో త్రాగునీరు, అన్నదానం, వైద్య సేవలు, చలువ పందిళ్లు తదితర సదుపాయాలతో స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అటవీ మార్గంలో ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే చికిత్స అందించేందుకు 7 అంబులెన్సులు, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అవసరమైతే స్ట్రెచర్ల ద్వారా సమీప ఆసుపత్రులకు తరలించే చర్యలు కూడా చేపట్టినట్లు చెప్పారు. అటవీ ప్రాంతంలో ప్రయాణించే భక్తులు తగు జాగ్రత్తలు పాటిస్తూ శివనామస్మరణతో దర్శనం పూర్తి చేసుకుని సురక్షితంగా స్వస్థలాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## దామోదర సంజీవయ్య 105వ జయంతి వేడుకలు

**అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన**

**మహోన్నత వ్యక్తి దామోదరం సంజీవయ్య**

**దామోదరం సంజీవయ్య జాతికి అందించిన సేవలు చిరస్మరణీయం**

**జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్**




నంద్యాల (ప్రశ్న న్యూస్) అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తి దామోదరం సంజీవయ్య అని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఉమ్మడి రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య 105వ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి డిఆర్ఓతో పాటు కలెక్టరేట్ ఏఓ సుభాకర్ రావు, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు, సఫాయి కర్మచార కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్ మాట్లాడుతూ

భారత రాజ్యాంగం వచ్చిన తర్వాత దళితుల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి దామోదరం సంజీవయ్యని అన్నారు. కష్టకాలంలో విద్యాభ్యాసాన్ని కొనసాగించి అనేక సవాలను ఎదుర్కొని తొలి దళిత ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన వ్యక్తి కాకుండా భారత ప్రభుత్వంలో కార్మిక పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నత పదవులు అలంకరించి దేశానికి అనేక సేవలందించారని కొనియాడారు. కర్నూలు జిల్లా పెదపాడు గ్రామంలో జన్మించిన తొలి రాష్ట్ర ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య దళిత పేద వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన మహనీయ వ్యక్తి అని కొనియాడారు. పేద ప్రజల జీవన ప్రమాణాల పెంపుకు ఆనాడే అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి అమలుకు కృషి చేసిన దామోదరం సంజీవయ్య చిరస్మరణీయులన్నారు.

అంతకుముందు దళిత సంఘాల నాయకులు దళితుల సంక్షేమం కోసం దామోదరం సంజీవయ్య చేసిన సేవలను వివరించారు.

## కొండు ఆదివాసి గిరిజనులకు కరెంట్ మీటర్లకు విద్యుత్ రాయితీవర్తించేయాలి.-అధిక బిల్లును తగ్గించాలి.

**జన్మన్ పథకంలో ఫ్రీ మీటర్ ఇవ్వాలి**

**రావికమతం సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద ధర్నా**




అనకాపల్లి(ప్రశ్న న్యూస్) జిల్లా రావికావతం మండలం జెడ్. బెన్న వరం. అజయ్పురం. పెద్దగరువు. బంగారు బందలు. పాత కొట్నాబెల్లి. డోల్లవానిపాలెం గ్రామాల్లో60 గిరిజనులకు గతంలో మీటర్లు దరఖాస్తు పెట్టేటప్పుడు. క్యాస్ట్ సర్టిఫికెట్లు జత చేసి దరఖాస్తు చేసాము. 2023 సంవత్సరం వరకు విద్యుత్ రాయితీ 200 యూనిట్ వరకు వచ్చేది. నేడు ఎస్టి విద్యుత్ మీటర్లకు " టాగు పోవడంతో . సబ్సిడీ పడకపోవడంతో అధిక బిల్లు రావడం. జరిగింది గతంలో ఎప్పుడూ కూడా బిల్లు ఇచ్చేవారు కాదు . నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2000 రూపాయలు నుండి 10000 వరకు అధిక బిల్లులు వస్తున్నాయి. దీనితో విద్యుత్ అధికారులు వచ్చి బిల్లులు కట్టకపోతే ఇంటికి విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని బెదిరించడంతో 1000 వరకు ప్రతినెల బిల్లు చెల్లిస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం కరెంట్ ఆఫీసులో టాగు లో తొలగించిన విద్యుత్ అధికారులు పై చర్య తీసుకోవాలని - 200 యూనిట్లు వర్తింపజేయాలని. కరెంటు మీటరు లేని వారికి ఫ్రీ కరెంటు మీటరు ఇవ్వాలని అధిక విద్యుత్ బిల్లు తగ్గించాలని డిమాండ్ చేయడం జరిగింది పెద్ద కరువు గ్రామంలో 10 కరెంట్ స్తంభాలు తుప్పు పట్టి పోయాయి. ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితి ఉంది. వీటిని తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే గోవిందరావు గిరిజన సంఘం నాయకులు పాడి బెన్న న్నయ్య. పాశీ గి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## నందిగామకు 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్



ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని కృషికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సత్కారం

నందిగామ (ప్రశ్న న్యూస్ ) ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ చిన్ని ని వారి కార్యాలయంలో నందిగామకు 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్ మంజూరు చేయడంలో ఎంపీ విశేష కృషిని కొనియాడుతూ శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, తన కృషి ఫలితంగా 2018లోనే నందిగామలో 20 పడకల ఆయుష్ హాస్పిటల్ ప్రారంభమైందని తెలిపారు. అయితే 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఆసుపత్రి పనులు కుంటుపడినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నందిగామ ప్రముఖుల ఆకాంక్ష మేరకు ఆయుష్ హాస్పిటల్‌ను మరింత విస్తృత స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రతిపాదన రూపొందించి ఎంపీ కి సమర్పించామని వెల్లడించారు.ఆ ప్రతిపాదనను ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి సంబంధిత కేంద్ర మంత్రితో చర్చించగా, నందిగామకు 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్ కేటాయించిన విషయాన్ని ఆయన తెలియజేసినట్లు విప్ సౌమ్య చెప్పారు. ప్రస్తుతం పరిపాలన అనుమతులు లభించాయని, స్థల సేకరణ ప్రక్రియ పూర్తయి, ప్రభుత్వం కొద్ది రోజుల్లో స్వాధీనం చేసుకుని పనులు ప్రారంభించనుందని ఎంపీ గారు వెల్లడించినట్లు తెలిపారు. అవసరమైన నిధులు కూడా త్వరలోనే విడుదల కానున్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ , రాష్ట్ర వైద్యశాఖామాత్యులు సత్యకుమార్ యాదవ్ కి, అలాగే ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని కి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నందిగామ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఆయుష్ వైద్యసేవలు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బీసీలకే సింహభాగం బడ్జెట్ కేటాయింపుల్లో

## సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు :మంత్రి సవిత



అమరావతి (ప్రశ్న న్యూస్) బీసీల అభ్యున్నతి పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి మరోసారి రుజువైందని, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో వెనుకబడిన వర్గాల సంక్షేమానికి చరిత్రలో కనీవినీ ఎరుగని కేటాయింపులు చేశారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆనందం వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ప్రవేశ పెట్టిన మూడు బడ్జెట్లోనూ నిధుల కేటాయింపులు పెంచుకుంటూ వెళుతున్నామన్నారు. నూతన బడ్జెట్ లో ఆదరణ 3.0 పథకానికి మరో రూ.1000 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తంచేశారు. 2026-27 బడ్జెట్ లో రూ.51,021 కోట్లు బీసీ సంక్షేమానికి కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి పయ్యావులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. 2026-27 బడ్జెట్ అన్ని వర్గాల వారికి అనుకూలమైనదన్నారు. ముఖ్యంగా బీసీల ఉన్నతికి బడ్జెట్ లో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. 2024-25 బడ్జెట్ లో రూ.39,007 కోట్లు, 2025-26 బడ్జెట్ 47,456 కోట్లు, 2026-27 బడ్జెట్లో 51,021 కోట్లు కేటాయించారన్నారు. అందులో ఈడబ్ల్యూఎస్ సంక్షేమానికి రూ.10,669 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. 2025-26లో రూ.10,614 కోట్లు, 2024-25లో రూ.10,273.80కోట్లు కేటాయించామన్నారు. నూతన బడ్జెట్‌లోనూ ఆదరణ 3.0 పథకానికి మరో రూ.1000 కోట్లు, చేనేతలకు, సెల్లూన్లకు ఉచిత విద్యుత్ కోసం రూ.150 కోట్లు, రూ.50 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. ఇలా ఏటా బీసీ సంక్షేమానికి నిధులు కూటమి ప్రభుత్వం కేటాయింపులు పెంచుతూ వస్తోందన్నారు. చరిత్రలో ఎరుగని విధంగా, సింహభాగం నిధులు బీసీల సంక్షేమానికి కేటాయించామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ ఇటువంటి కేటాయింపులు చేయలేదన్నారు. రాయలసీమ ను గ్లోబల్ హార్టీ కల్చర్ గా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం రూ.30 వేల కోట్లు కేటాయిస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా బడ్జెట్ ను రూపకల్పన చేశామన్నారు. వ్యవసాయానికి, పారిశ్రామిక రంగానికి కూడా ప్రాధాన్యమిస్తూ బడ్జెట్ లో నిధులు కేటాయించామన్నారు, బీసీల పట్ల కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబుకు, ఆర్థిక మంత్రి పయ్యావులకు మంత్రి సవితకు ఆ ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు.

# నీలోజిపల్లిలో మహాశివరాత్రి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

- ఈనెల 19 న నీలకంఠేశ్వర స్వామి కళ్యాణం
- భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి తరించాలి
- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామంలోని శ్రీ నీలకంఠేశ్వర శివ పంచాయతన ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామని, ఆదివారం ఉదయం 8 గంటలకు లఘున్యాస పూర్వక అభిషేకాలు,అర్చనలు నిర్వహించగా, లింగోద్భవ కాలమైన రాత్రి 11:30 గంటలకు మహాన్యాస పూర్వక అభిషేకాలు జరగనున్నాయని గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ గ్రామ పాలకవర్గం సభ్యులతో కలిసి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలాగే ఫిబ్రవరి 19, 2026 గురువారం ఉదయం 9 గంటలకు నూతనంగా తయారు చేసిన భవానీ సమేత నీలకంఠేశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రాణ ప్రతిష్ట, హవనం నిర్వహించనున్నామని, అనంతరం అభిజిత్ లగ్నంలో స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని వేదమూర్తులైన బ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నామన్నారు.ఈ సందర్భంగా సమస్త భక్తులు, గ్రామ ప్రజలు స్వామివారి కళ్యాణాన్ని తిలకించి, ఆలయంలో ఏర్పాటు చేసే అన్నప్రసాదాన్ని స్వీకరించాలని గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుసుంబ మహేందర్, మాజీ జడ్పీటీసీ కొనుకటి లచ్చిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య,గోనె ఆనంతరెడ్డి,పెంతల బాల్ రెడ్డి,డాక్టర్ జక్కని లక్ష్మీ నారాయణ,ఉమ్మరెడ్డి అనిల్ రెడ్డి,తిమ్మపురం సతీష్,చెంచు సంపత్,గూడ బాల కిషన్,ఆవుల లక్ష్మణ్,అనుముల దేవయ్య,అనుముల బాల కిషన్, గూడ రమేష్, ఎర్ర ప్రతాప్ రెడ్డి, ఎర్ర కిషన్, ఆవుల మల్లయ్య, కొనుకటి కమలాకర్, కొనుకటి తిరుపతి, ఎర్ర మల్లయ్య (పాపారావు),ఎల్ల లింగారెడ్డి, కత్తెరపాక దర్శన్, కుడుకల శ్రీకాంత్,ఎర్ర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఆరిమేను పాడులో 'భూ' దందా


- చోద్యం చూస్తున్న రెవిన్యూ అధికారులు



ఓజిలి (ప్రశ్న న్యూస్) ఓజిలి మండలంలోని ఆరిమేను పాడు గ్రామంలో భూబకాసురులు రెచ్చిపోతున్నారు. గ్రామానికి ఆసరాగా ఉన్న 'కొత్తచెరువు' పరివాహక ప్రాంతంలోని ప్రభుత్వ భూములను కొందరు వ్యక్తులు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. కళ్ళ ముందే ప్రభుత్వ ఆస్తులు కబ్జా అవుతున్నా, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.కొందరు తమ సొంత ఆస్తిగా భావిస్తున్నారు. జెసిబిలతో చెరువు గట్టును చదును చేసి, హద్దు రాళ్లను తొలగించి సాగులోకి తెచ్చుకోవడం ప్రయత్నిస్తున్నారు. దీనివల్ల చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడమే కాకుండా, వర్షాలు వచ్చినప్పుడు గ్రామంలోకి నీరు వచ్చే ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్తులు పలుమార్లు మండల రెవెన్యూ అధికారులకుఫిర్యాదు చేసినా, క్షేత్రస్థాయిలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అధికారులు పరోక్షంగా కబ్జాదారులకు సహకరిస్తున్నారని, అందుకే వారు నిర్భయంగా ఆక్రమణలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత ఉన్న వారే మౌనంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది ఇకనైనా రెవెన్యూ అధికారులు స్పందించి కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములను కాపాడాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

# మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైన శ్రీ శ్రీ శ్రీ త్రిలింగ సంగమేశ్వరాలయం

- భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలి
- ఆలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు భక్తులు సహకరించాలి
- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలోని పురాతన శ్రీశ్రీశ్రీ త్రిలింగ సంగమేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి వేడుకల సందర్భంగా సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ వేడుకలను గ్రామ పంచాయతీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య మాట్లాడుతూ,నేడు ఆదివారం నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం హాజరు కానున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని కోరారు. అలాగే విలాసాగర్ సంగమేశ్వర ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావడానికి భక్తులు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

# గుండ్ల బ్రహ్మేశ్వర స్వామి దర్శనం కు మార్గం సుగమం

**మంత్రి ఫరూక్ విజ్ఞప్తితో స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**
**రెండు రోజులు అటవీ మార్గంలో రాకపోకలకు అనుమతి**
**డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి ఫరూఖ్**

నంద్యాల(ప్రశ్న న్యూస్) మార్కాపురం జిల్లా సరిహద్దులో ఉన్న నాగార్జునసాగర్- శ్రీశైలం పులుల అభయారణ్యంలో ఉన్న శ్రీ గుండ్ల బ్రహ్మేశ్వర స్వామి ఆలయానికి మహాశివరాత్రి సందర్భంగా భక్తులు వెళ్లేందుకు మార్గం సుగమం అయింది. రెండు జిల్లాల సరిహద్దులో ఉన్న గుండ్లబ్రహ్మేశ్వర క్షేత్రానికి



దశాబ్దాల కాలం నుంచి ఎంతో పురాతనమైన ప్రాశస్యత నేపథ్యం ఉంది. అశ్వత్థామ మహర్షి చేత ప్రతిష్టించబడిన స్వయంభూ శివలింగ క్షేత్రంగా గుండ్ల బ్రహ్మేశ్వర స్వామి క్షేత్రానికి ఎంతో విశిష్టమైన ప్రాధాన్యత, పురాతన నేపథ్యం ఉంది. ఏడాదిలో కేవలం శివరాత్రి పర్వదినాల్లో, రెండు రోజులు మాత్రమే భక్తుల సందర్శనార్థం మాత్రమే భక్తుల రాకపోకలకు అటవీ శాఖ షరతులతో కూడిన రాకపోకలకు అనుమతి ఇవ్వడం జరుగుతున్నది. ఈ ఏడాది పులుల లెక్కింపు కారణంగా అటవీశాఖ రాకపోకలకు అనుమతులు ఇవ్వలేదు.

### గుండ్ల బ్రహ్మేశ్వరం కు నాలుగు మార్గాలు

దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన గుండ్ల బ్రహ్మేశ్వరం క్షేత్రానికి చేరుకునే మార్గాలు ఇవే.

1.నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామం అక్కడి నుంచి ట్రాక్టర్ల సాయంతో కొండ మొక్క అనే ప్రదేశం వరకు స్థానికులు చేరవేస్తారు.అక్కడి నుంచి పది కిలోమీటర్లు నడిస్తే క్షేత్రం చేరుకోవచ్చు.

2. బండి ఆత్మకూరు మండలం నారాయణపురం నుంచి మొత్తం 22 కిలోమీటర్లు ఉంటుంది.

3.నంద్యాల- గిద్దలూరు మార్గంలో దిగువమెట్ట నుంచి



జీపులు, ట్రాక్టర్లు కాలినడకన 20 కిలోమీటర్లు ప్రయాణిస్తే గుండ్ల పరమేశ్వరం చేరవచ్చు.

4.మార్కాపురం జిల్లా గిద్దలూరు తాలూకా అర్ధవీడు మండలం పాపినేని పల్లె గ్రామం నుంచి వాహనాల్లో కాలినడకన సుమారు 25 కిలోమీటర్ల ప్రయాణించి గుండ్ల బ్రహ్మేశ్వరం చేరవచ్చు.

### పులుల లెక్కింపు ప్రక్రియతో నెలకొన్న సందిగ్ధత :

నాగార్జునసాగర్- శ్రీశైలం పులుల అభయారణ్యం (ఎన్. ఎస్. ఆర్. టి) లో గుండ్ల బ్రహ్మేశ్వరం ఆలయానికి మహా శివరాత్రి మినహా మిగతా రోజుల్లో మనుషులు, వాహనాల రాకపోకలకు అనుమతించరు. పులులతో పాటు ఇతర అరుదైన జంతు, పశు పక్షాదుల సంరక్షణకు ఆటంకం ఏర్పడకుండా అటవీశాఖ కట్టుదిట్టమైన చర్యలు అమలు చేయడం జరుగుతున్నది. ఈ కారణంగానే ప్రతి సంవత్సరం కేవలం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రెండు రోజులపాటు భక్తుల రాకపోకలకు షరతులతో కూడిన అనుమతి ఇవ్వడం జరుగుతోంది. అయితే ఈ ఏడాది పులుల లెక్కింపు ప్రక్రియ కారణంగా కారణంగా గుండ్ల బ్రహ్మేశ్వరం కు భక్తులకు అనుమతి ఇవ్వడంపై సందిగ్ధత ఏర్పడింది.

### మంత్రి ఫరూక్ విజ్ఞప్తితో స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

మహాశివరాత్రి సందర్భంగా నంద్యాల- మార్కాపురం జిల్లా



సరిహద్దు నాగార్జునసాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వు అటవీ ప్రాంతంలో ఉన్న గుండ్ల బ్రహ్మేశ్వరం (జి బి యం) ఆలయ సందర్శనకు రెండు రోజులు అనుమతి లభించింది.పులుల లెక్కింపు ప్రక్రియ కారణంగా భక్తుల సందర్శనకు మొదట అటవీశాఖ అనుమతులు ఇవ్వలేదు. ఈ విషయంపై శివరాత్రికి క్రమం తప్పకుండా గుండ్ల బ్రహ్మేశ్వరానికి వెళ్లే భక్తులు పలువురు అమరావతికి వచ్చి రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ దృష్టికి సమస్యను తెలిపారు.భక్తుల మనోభావాలకు అనుగుణంగా గుండ్ల బ్రహ్మహేశ్వర క్షేత్రానికి వెళ్లేందుకు రెండు రోజులపాటు అనుమతి ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కు రాతపూర్వక విజ్ఞప్తిని మంత్రి ఫరూక్ అందజేశారు. మంత్రి ఫరూక్ విజ్ఞప్తిపై చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ ఉన్నతాధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించడంతో ఈ ఏడాది నెలకొన్న సందిగ్ధత వీడింది.మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 14,15 వ తేదీల్లో జిబి యం కు వెళ్లేందుకు భక్తులకు అనుమతి ఇస్తూ అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ డాక్టర్. పి.వి.చలపతిరావు ఉత్తర్వులు జారీ చేశారు. స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు మంత్రి ఫరూక్ కృతజ్ఞతలు తెలిపారు. అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగా భక్తులు గుండ్ల బ్రహ్మేశ్వరం ఆలయాన్ని సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి గుండ్ల బ్రహ్మేశ్వర స్వామి క్షేత్రం కు మహాశివరాత్రికి వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా మార్గం సుగమం చేయించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు కృతజ్ఞతలు తెలుపుతూ, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు

# రామగుండం మేయర్ రేసులో మహంకాళి స్వామి 46 డివిజన్ కార్పొరేటర్ గా గెలుపు

**గోదావరిఖని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అనుభవం**
**రామగుండం బల్దియా పొలిటికల్ బాస్ గా స్వామికే మొగ్గు**

రామగుండం ( ప్రశ్న న్యూస్ ) రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కొత్త మేయర్ గా మహంకాళి స్వామి ఎన్నిక కానున్నారు. ఈ మేరకు అధికార ప్రకటన లాంఛనమే కానున్నట్లు సమాచారం. తొలిసారిగా కార్పొరేటర్ గా 46 డివిజన్ తరుపున గెలిచిన మహంకాళి స్వామి , రామగుండం బల్దియాకే ప్రథమ పౌరుడిగా 16న బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటికే గోదావరిఖని పట్టణ కాంగ్రెస్ పార్టీని అధ్యక్షుడిగా నడిపిస్తున్న స్వామి, కాంగ్రెస్ పార్టీ గెలుపును సునాయాసం చేశారు. రామగుండం నియోజకవర్గంలో శాసన సభ్యులు రాజ్ ఠాకూర్ తర్వాత నెంబర్ 2 స్థాయిలో స్వామి ఎదుగుతూ వచ్చారు. టౌన్ కాంగ్రెస్ తరుపున ప్రజలకు అండగా ఉంటూ పార్టీని ప్రజలకు చేరువ చేస్తూ వచ్చారు. 2023 డిసెంబర్ నెలలో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మక్కాన్ సింగ్ రాజ్



ఠాకూర్ గెలిచేందుకు స్వామి విశేష కృషి చేశారని టౌన్ ప్రజలు విశ్వసిస్తున్నారు.

**కోల్ సిటీ స్పెషల్ ఏంటంటే..**

తెలంగాణ రాష్ట్రంలోనే రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కి ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఉన్నన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలు ఇంకే కార్పొరేషన్ లో లేవు. దాదాపుగా 60 కార్పొరేటర్ సీట్లు ఉన్న కార్పొరేషన్ ను మేయర్ గా స్వామి పరిపాలన చేయనున్నట్లు టౌన్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



**సీఎం , ఎమ్మెల్యే ఆశీస్సులు..**

రాష్ట్ర స్థాయిలో సీఎం రేవంత్ రెడ్డి, నియోజకవర్గం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆశీస్సులు, మద్దతుతో త్వరలోనే తాను అధికార మేయర్ పీఠాన్ని అధిరోహించనున్నట్లు మహంకాళి స్వామి భావిస్తున్నట్లు సమాచారం.

# ప్రజాస్వామ్యానికి నాల్గో స్తంభం జర్నలిజం

**ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్**
**ప్రజల సమస్యలపై ధైర్యంగా నిలబడాలి మీడియాకు పిలుపు**
**ఉప్పల్ అభివృద్ధిలో నిర్మాణాత్మక పాత్ర పోషించాలి**
**ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి ఘన సన్మానంలి**

ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ ప్రెస్ క్లబ్( ప్రింట్ ఢ ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ) సభ్యులు నూతన అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి, అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజాస్వామ్యంలో జర్నలిజం నాల్గో స్తంభంగా నిలుస్తుంది. ప్రజలకు నిజమైన, నిష్పక్షపాత సమాచారం అందించడం మాత్రమే కాదు, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తీసుకురావడం కూడా మీడియా బాధ్యత. జర్నలిస్టులు ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా ధైర్యంగా ప్రజల తరఫున నిలబడాలి" అని పేర్కొన్నారు.అలాగే



ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఉప్పల్ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో మీడియా ప్రతినిధులు నిర్మాణాత్మక సూచనలు చేయాలని కోరారు.ఉప్పల్ ప్రింట్ ఢ ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలకు తన పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం క్లబ్ అధ్యక్షుడు మరియు సభ్యుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రామంతపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్తా, మేడ్చల్ జిల్లా ఓబీసీ రేపు నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# మంచిర్యాల మేయర్ రేసులో 39 డివిజన్ కార్పొరేటర్ పూదరి సునీత ప్రభాకర్

- ప్రజా ప్రభుత్వంలో మహిళా ప్రజా సేవకులు- మహిళా నాయకులకే పట్టం కట్టే అవకాశం

ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పరిశీలనలో మహిళా నేతలు



సీతారామ కాలనీ ( ప్రశ్న న్యూస్ )మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఈసారి మహిళలు విజయదుందుభి మోగించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పరిపాలనలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రజా ప్రభుత్వంలో మహిళా ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇన్నాళ్లు మున్సిపాలిటీగా ఉన్న మంచిర్యాల, కాంగ్రెస్ పాలనలో కార్పొరేషన్ స్టేటస్ అందుకుంది. ఈ క్రమంలో జరిగిన తొలి ఎన్నికల్లో మంచిర్యాల కార్పొరేషన్ కార్పొరేటర్లుగా మహిళా నేతలు గెలిచి పరిపాలన చేసేందుకు ముందు వరుసలో నిలిచారు. ఈ నెల 16 తేదీన మేయర్ ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ క్యాబినెట్ ర్యాంక్ ఛైర్మన్, , ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మొదటి మేయర్ ఎంపిక కోసం కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది.



# బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో దోపిడీ రాజ్యం



- లడ్డు ధరల్లో రెండు రేట్లు, బయట ఒకలా.. కౌంటర్ ముందు మరోలా
- కొబ్బరినీళ్ల, చిప్పల వ్యాపారం.. ఎవరి జేబుల్లోకి వెళ్తోంది లాభం.?
- నిద్రావస్థలో ఈవో.. పర్యవేక్షణ పూర్తిగా కరువు
- ఎండోమెంట్ ఉన్నత అధికారుల బాధ్యతారాహిత్యమా.?
- ఆలయాలలో జరుగుతున్న దోపిడీపై తెలంగాణ సర్కార్ మౌనమేలా.?

(ఆర్ కె -ప్రశ్న న్యూస్ బ్యూరో)



హైదరాబాద్ లో ఎంతో ప్రసిద్ధి చెందిన బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో భక్తి కన్నా అక్రమ వ్యాపారం పెద్దదైందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఆలయానికి వచ్చే భక్తుల విశ్వాసాన్ని నగదుగా మార్చుకుంటున్నారనే విమర్శలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. లడ్డు ప్రసాదం ధరల గందరగోళం నుంచి కొబ్బరినీళ్ల దందా వరకు అనేక అంశాలు వివాదాస్పదంగా మారాయి. అయినా ఎండోమెంట్ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువైంది ఎవరి వాటాలు వారికి అందడంతో అధికారులంతా మౌనంగా ఉంటున్నారని ఇదే అదనుగా కిందిస్థాయి సిబ్బంది కాంట్రాక్టర్ భక్తులను నిలువు దోపిడీ చేసుకుంటున్నారు అయిన అడ్డుకునే నాధుడే లేకుండా పోయాడు.

### - లడ్డు ప్రసాదం.. రెండు బోర్డులు.. రెండు ధరలు భక్తులు షాక్

తెలంగాణలో ఎండోమెంట్ పరిధిలో ఉన్న దేవాలయాలు భక్తులను దోచుకునే నిలయాలుగా మారుతున్నాయి. ప్రజలలో భక్తి మార్గం పెంచాల్సింది పోయి దానిని అడ్డుపెట్టుకొని వ్యాపారం చేయడం సర్వసాధారణంగా మారింది. అందులో భాగంగా బల్కంపేట ఆలయంలో భక్తులు చూసే చోట ప్రసాదం ధరలు తక్కువ ఉన్న బోర్డు ఏర్పాటు చేశారు. అదే కౌంటర్ దగ్గర చూస్తే ఎక్కువ ధర బోర్డు పెట్టారు. ఈ వ్యత్యాస్యం ఎందుకు.? తేడా డబ్బు ఎవరి జేబుల్లోకి వెళుతుంది.? భక్తులని కన్ఫ్యూజ్ చేయడం ఎందుకు.? ఆలయ ఈవోకు బాధ్యత లేదా.? ఆలయ ఈవో విధులు నిర్వహించడం లేదా.? నిద్రపోతున్నారా.? బోర్డులు కనిపించడం లేదా.? అంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ఒకే లడ్డు ప్రసాదానికి రెండు వేర్వేరు



ధరల బోర్డులు కనిపిస్తున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. బయట పెట్టిన బోర్డులో తక్కువ ధర చూపించి, కొనుగోలు సమయంలో ఎక్కువ వసూలు చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

### - భక్తుల సందేహాలు..

ఒకే ప్రసాదానికి రెండు రేట్లు ఎందుకు.? ధరల ఏకీకరణ ఎందుకు లేదు.?
అదనంగా వసూలైన డబ్బు ఎక్కడికి వెళ్తోంది.? ఆలయ నిర్వహణపై అధికారుల
పారదర్శకత లేకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### - కొబ్బరినీళ్ల దందా.. ? టెంకాయ కొట్టగానే చెల్లింపు.?

ఆలయంలో కొబ్బరికాయ కొట్టే భక్తులు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.భక్తులు కొబ్బరికాయలు కొట్టే అవకాశం లేదు కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన సిబ్బందికి కొబ్బరికాయ ఇవ్వాల్సిందే వాళ్లు కొట్టిన కొబ్బరికాయల నీళ్లు బాటలలో నింపుకొని 800 మిల్లీలీటరుకు 50 రూపాయల చొప్పున కాంట్రాక్టర్ సిబ్బంది అమ్ముకుంటున్నారు, అమ్మవారికి కొబ్బరికాయ నైవేద్యం పెట్టకు ముందే కొబ్బరి నీళ్లను ఎంగిలి చేయడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరికాయ కొట్టిన వెంటనే అక్కడ సిబ్బందికి డబ్బులు ఇవ్వాలి అంటూ ఒత్తిడి తెస్తారు. కొబ్బరికాయ కొట్టే విషయంలో మాత్రం పూర్తి స్వార్థం భక్తునికి ఇచ్చే పచ్చ చిన్నగా కొట్టి కాంట్రాక్టర్ తీసుకునే పచ్చ పెద్దదిగా కొడతాడు అంటే కాంట్రాక్టర్ తీసుకునే కొబ్బరి పచ్చ 70% లేదా 80% తీసేసుకుంటాడు. భక్తునికి ఇచ్చే కొబ్బరి చిప్ప 30 నుండి 20 శాతం మాత్రమే ఉంటుంది. ఇలా భక్తులను కళ్ళముందే దోపిడీ చేస్తున్న ఆలయ సూపరింటెండెంట్, ఈవో ఎండోమెంట్ అధికారులకు కనిపించదు, ఎందుకంటే కాంట్రాక్టర్ వాళ్లకు కావలసిన మామూలు ఇచ్చేస్తాడన్న



ఆరోపణలు ఉన్నాయి.

### - భక్తులు చెబుతున్నదేమిటంటే..

బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో చిన్న మొత్తాలు భక్తుల జేబు నుంచి పోతుంటే, పెద్ద లాభాలు కాంట్రాక్టర్‌కు చేరుతున్నాయంటున్నారు. భక్తులకు ఉచిత ప్రసాదం కూడా పెట్టడం లేదని, అన్నదాన నిర్వహణలో కూడా అనేక అవకతవకలు ఉన్నాయని దీనిపై స్టేట్ విజిలెన్స్ అధికారులు వచ్చే విచారణ జరిపించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

### - ఈవో పర్యవేక్షణ ఎక్కడ.?

ఎల్లమ్మ తల్లి ఆలయంలో జరుగుతున్న అనేక అవకతవకలపై ఆలయ అధికారుల పాత్రపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.
ఈ అక్రమాలపై ఈవోకు సమాచారం లేదా.? లేకుంటే ఈవో విధులు నిర్వహించడం లేదా.?
కాంట్రాక్టర్ షరతులు ఏమిటి.? ధరల నియంత్రణ ఎందుకు లేదు.?
అదనపు వసూళ్లలో ఎవరి వాటా ఎంత.? ఎండోమెంట్ ఉన్నత అధికారుల
పర్యవేక్షణ బలహీనంగా ఉందా.? ఉచిత ప్రసాదం ఆలయ సమయాలలో ఎందుకు పెట్టడం లేదు.? అన్నది విచారణతోనే తేలాల్సి ఉంది.

### - భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించే నా.?

ఆలయంలో లడ్డు ధర ఒకటే స్పష్టమైన డిస్‌ప్లే ఏర్పాటు చేయాలని కొబ్బరినీళ్ల వసూళ్లను వెంటనే ఆపివేయాలని కాంట్రాక్టర్ల పనితీరుపై ఆడిట్ చేయాలని కొబ్బరి పచ్చల వ్యవహారంపై ఈవో వివరణ ఇవ్వాలని ఆలయంలో జరుగుతున్న వ్యవహారాలపై సీసీటీవీ పర్యవేక్షణ పెంచాలని స్టేట్ విజిలెన్స్ అధికారులచే ప్రత్యేక విచారణ చేయించాలని భక్తులు కోరుతున్నారు.

### - భక్తుల నమ్మకాన్ని కాపాడాలి.. దోపిడి కాదు

బల్కంపేట ఎల్లమ్మ తల్లిపై అపార విశ్వాసంతో వచ్చే భక్తుల ఆరోపణలు అధికారులు, సిబ్బంది ఎదుర్కోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆలయ నిర్వహణలో పారదర్శకత పెంచి భక్తుల విశ్వాసాన్ని కాపాడడం ఎండోమెంట్ అధికారుల బాధ్యత కావాలని భక్తులు కోరుతున్నారు.

# తొలి అడుగు పడింది

### - తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై పవన్ కళ్యాణ్



అమరావతి (ప్రశ్న న్యూస్) పోరాట పటిమ, సంస్కృతి సంప్రదాయాల శక్తి నింపుకున్న తెలంగాణ నేల తల్లికి హృదయపూర్వక పాదాభివందనం అన్నారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. తెలంగాణలో ఉద్భవించిన పార్టీ జనసేన మున్సిపల్ ఎన్నికల్లో తొలి అడుగు వేసిందన్నారు. పార్టీ తొలినాళ్ళు గుర్తు చేసుకొంటే దారంతా గతుకులు, భవిష్యత్తు ఏమిటనే ప్రశ్న. చిన్నపాటి ఆసరా కూడా లేదన్నారు. అయినా మిణుకుమిణుకుమనే ఆశతో పార్టీ సిద్ధాంతాలను విశ్వసించిన వీర మహిళలు ఝాన్సీ లక్ష్మీ భాయి స్ఫూర్తిని నింపుకొని, ఉద్యమ స్ఫూర్తితో జనసైనికులు ఎలాంటి ఒడిదుడుకులనైనా తట్టుకొనేందుకు సంసిద్ధులయ్యారని పవన్ కళ్యాణ్ కొనియాడారు. తెలంగాణలోని వీర మహిళలు, జనసైనికులు పురపాలక ఎన్నికలకు సన్నద్ధమయ్యారు. 2998 స్థానాలున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జనసేన 332 చోట్ల పోటీ చేసింది. ఒక కౌన్సిలర్ స్థానం, ఒక కార్పొరేటర్ స్థానం జనసేన నెగ్గడంపై పవన్ కళ్యాణ్ స్పందించారు. మహా వృక్షమైనా చిన్న విత్తు నుంచే నేల పొరలను చీల్చుకొని మొలక వేస్తుందన్నారు. విశ్వ విజేత కూడా తల్లి గర్భంలో అణువంతే ఉంటాడని పేర్కొన్నారు.కోటి రతనాల వీణ తెలంగాణలో జనసేన విజయ ప్రయాణం లేలేత అడుగులతో మొదలైంది. నేరేడుచర్ల మున్సిపాలిటీలో ఆరూరి విజయలక్ష్మి, మంచిర్యాల కార్పొరేషన్ లో అగ్గు సాగర్ జనసేన అభ్యర్థులుగా సాధించిన విజయాలు భవిష్యత్తు ప్రస్థానానికి బలమైన స్ఫూర్తిని అందిస్తాయని పవన్ కితాబిచ్చారు. వార్డు మెంబర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ సాగర్ లను మనస్ఫూర్తిగా అభినందించారు. జనసేన తెలంగాణ వీర మహిళలు, జనసేన సైనికులు, నాయకులకు పవన్ కళ్యాణ్ అభినందనలు తెలిపారు. జనసేన పార్టీ ఉద్భవించిన నేలపై దక్కిన తొలి విజయం కావడంతో హర్షం వ్యక్తం చేశారు. పోరాట పటిమ, సంస్కృతి సంప్రదాయాల శక్తిని అణువణువునా నింపుకున్న తెలంగాణ నేల తల్లికి పాదాభివందనాలు తెలిపారు.

# నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను మేమే కైవసం చేసుకుంటాం

### - రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభావం ఉండదన్న పీసీసీ చీఫ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఎన్నికల ఫలితాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంతృప్తిని వ్యక్తం చేశారు. నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను కూడా తామే కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమవుతానని ఈ భేటీలో కార్పొరేషన్లపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ ఎన్నికలు కల్వకుంట్ల కవితకు సంతోషాన్ని ఇచ్చి ఉండవచ్చని మహేశ్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకు పతనమవుతోందని రాబోయే రోజుల్లో ఆ పార్టీ ప్రభావం ఉండదని చెప్పారు. మతాన్ని రెచ్చగొట్టినా మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఏమీ సాధించలేకపోయిందని ఎద్దేవా చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ఈ ఎన్నికల ఫలితాలతో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో తన పట్టును మరింత పెంచుకున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# నేడే మహాశివరాత్రి





- అభిషేకప్రియునికి అత్యంత ప్రీతికరమైన రోజు
- అంతులేని ఆధ్యాత్మికత
- ప్రతి అణువూ ఆయన స్వరూపమే
- మహాశివరాత్రికి శివ వైభవం
- భక్తుల్లో ఆధ్యాత్మిక భావనలు
- ఉత్సవాలకు ముస్తాబైన శైవక్షేత్రాలు

"మహాశివరాత్రి రోజు పరమశివునికి ఎంతో ప్రీతికరమైన రోజుగా ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ పవిత్రమైన రోజున ఉపవాసం ఉండటం, జాగరణ చేయడం, రోజంతా శివనామస్మరణతో శివుడికి దగ్గరగా గడపడం, ప్రదోషవేళ శివుడిని అభిషేకించడంతో పాటు ప్రత్యేకంగా బిల్వార్చన, రుద్రాభిషేకం వంటివి చేయడం అత్యంత శుభప్రదం, ముఖ్యంగా మహాశివరాత్రి రోజు ఉపవాసం ఆచరించడం మంచిదని చెబుతారు. అలాగే మహాశివరాత్రి రోజున జాగరణ చేయడం వల్ల.. అందులోనూ రాత్రి పూట చేసే శివార్చన, శివాభిషేకం వల్ల శరీరంలో తేజస్సు కలుగుతుందని పండితులు చెబుతారు. అలాగే భగవంతుడి మీద సాధకులకు, మోక్షమార్గంలో ప్రయత్నించే వారికి రాత్రిపూట విశేషమైన సమయంగా భావిస్తారు. శివుడు అభిషేక ప్రియుడు కాబట్టి మహాశివరాత్రి రోజు సాయంత్రం 5-6 గంటల సమయం నుంచి అర్ధరాత్రి 2 గంటల సమయం మధ్యన చేసే రుద్రాభిషేకం, శివార్చన, బిల్వార్చన వల్ల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలుగుతాయని పండితులు చెబుతారు. మహాశివరాత్రి సందర్భంగా శివుని విశిష్టతను గురించి తెలుసుకుందాం"

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) శివుడిని ఆరాధించినా లేదా మనకు ఎలాంటి మంత్రాలూ తెలియక కేవలం భక్తి శ్రద్ధలతో శివలింగం మీద చెంబుడు నీళ్లు పోసినా రెండూ సమానమే అంటాడట ఆ కైలాసనాథుడు. మన సంప్రదాయంలో నిత్య శివరాత్రి, పక్షశివరాత్రి, మాస శివరాత్రి, మహా శివరాత్రి, యోగ శివరాత్రి అనే ఐదు రకాల శివరాత్రులు ఉన్నాయని మన పురాణాలు చెబుతున్నాయి. ప్రతి రోజూ శివుడిని ఆరాధించడం అనేది నిత్య శివరాత్రి. ప్రతి మాసంలో శుక్ల బహుళ చతుర్దశి రోజు శివారాధన చేయడం అనేది పక్ష శివరాత్రి. ప్రతి మాసంలో బహుళ చతుర్దశి రోజున శివుడిని పూజించడం అనేది మాస శివరాత్రి. అలాగే మాఘ బహుళ చతుర్దశి తిథిని అత్యంత విశిష్టమైన మహాశివరాత్రిగా శివపురాణం పేర్కొంటోంది. ఇక ఐదో శివరాత్రి అయిన యోగ శివరాత్రి విషయానికొస్తే సాధకుడు తన యోగ మహత్యంతో యోగ నిద్రకు ఉపక్రమించడాన్ని యోగ శివరాత్రి అంటారట.

### పరమేశ్వరుడు పరమ దయాళువు..

పరమేశ్వరుడు పరమ దయాళువు. ప్రకృతిలోని ప్రతి అణువూ ఆయన స్వరూపమే. ఆయనకు ఆధీనమే. కానీ, ఆ స్వామి దేనికీ కట్టుబడలేదు. కనీసం కట్టు బట్టలు కూడా విలాసవంతమైనవి స్వీకరించడు. విభూది ధరిస్తాడు. పులిచర్మం చుట్టుకుంటాడు. విష సర్పాలు ఆయనకు హారాలు, సగం మిగిలిన నెలవంక ఆయన తలపైన అలంకారం. ఉవ్వెత్తున ఎగసిపడే కెరటాలతో దూకే గంగను నెత్తిన పెట్టుకున్నాడు. వయసుడిగిన వృషభం.. వాహనం.. మెడలో కపాలమాల.. చేతిలో త్రిశూలం.. ఏమిటీ చిత్రవిచిత్రమైన ఆహార్యం. ఇంతకన్నా సాగపైన వస్తువులేవీ స్వామికి దొరకలేదా అంటే సమస్తమైన విశ్వమే ఆయన కనుసన్నల్లో నడుస్తుంది. ఇక ఆయనకు కానిది. లోతుగా ఆలోచిస్తే అసలు తత్వం బోధపడుతుంది. పైపైకి.. మామూలు కండ్లతో చూస్తే శివయ్య లీల ఓ పిచ్చి జంగమదేవర తీరు. అదే కండ్లు మూసుకుని మను తెరచి చూస్తే అనంతమైన శివ వైభవం సాక్షాత్కరిస్తుంది. అస్వామి ఆకారం. ఆహార్యం అన్నిటా అంతులేని ఆధ్యాత్మిక భావనలు వెల్లివిరుస్తాయి.

### జ్ఞానానికి స్థానం... త్రిశూలం..

పరమశివుణ్ని చూడగానే ఆయన చేతిలో త్రిశూలం తళుక్కుమని మెరుస్తూ కనిపిస్తుంది. ఎంతోమంది రాక్షసులను అంతం చేసి, భక్తుల ప్రాణాలు కాపాడిన మహాశక్తిమంతమైన ఆయుధం అది. శివయ్య చేతికది అలంకారం. త్రిశూలం అంటే మూడు కొనలు కలిగినదని అర్థం. సాధారణ ఆయుధానికి ఉండే కొనలు కావవి. ఆ మూడు కొనలు సత్వ, రజో, తమో గుణాలకు ప్రతీకలు. ఆ మూడు కొనలు పిడి దగ్గర కలుసుకుంటాయి. త్రిగుణాల ఏకత్వానికిది సంకేతం. యోగపరంగా చూస్తే త్రిశూలంలోని మూడుకొనలు మానవ శరీరంలోని ఇడ, పింగళ, సుషుమ్న నాడులకు సంకేతాలు. ఈ మూడు నాడులు శిరస్సులో ఉండే జ్ఞానకేంద్రం దగ్గర కలుస్తాయి. ఇదే త్రివేణీ సంగమం. మూడుకొనలు మూడు నాడులకు సంకేతాలైతే జ్ఞానకేంద్రం శూలహస్తాన్ని సూచిస్తుంది. వాటి ఏకత్వాన్ని, త్రిగుణ సంగమాన్ని ప్రకటిస్తుంది. త్రిగుణాల ఏకత్వాన్ని ప్రకటించే చోటును పట్టుకున్న శివుడు నేనీ త్రిగుణాలకు అతీతుడను అనే సత్యాన్ని ప్రకటిస్తాడు. అంతేకాదు.. భూత, భవిష్యత్, వర్తమానాలనే త్రికాలాలకు, జాగృత్, స్వప్న, సుషుప్తులనే త్రిస్థితులకు తానే అధిదేవతను అనే సత్యాన్ని కూడా త్రిశూలం ద్వారా పరమశివుడు తెలియజేస్తాడు. అధి దైవిక, అధి భౌతిక, ఆధి ఆత్మిక (ఆధ్యాత్మి) తాపాలను త్రిశూలం పోగొడుతుంది. మరొక అర్థంలో త్రిశూలంలోని మూడుకొనలూ కోరిక, చర్య, జ్ఞానం అనే మూడు శక్తులను సూచిస్తాయి. ఇవే ఇచ్ఛ, జ్ఞాన, క్రియాశక్తులు. త్రిశూలానికి సంబంధించి ఆసక్తికరమైన పురాణగాథలూ ఎన్నో ఉన్నాయి. ఒకానొక సందర్భంలో శివుడు కాశీ పట్టణాన్ని తన త్రిశూలంతో ఎత్తి పట్టుకుంటాడట. మొత్తం ప్రపంచం నాశనమైనా, ప్రళయం వచ్చినా కాశీకి ఎటువంటి ఆపదా కలగదని వరమిచ్చాడని పురాణాల ద్వారా తెలుస్తున్నది. అంతేకాదు అంధకాసురుడిని సంహరించే సమయంలోనూ త్రిశూలానిదే ప్రధాన పాత్ర. శివుడు రాక్షసుడిని సంహరించకుండా త్రిశూలానికి గుచ్చి ఉంచాడు. త్రిశూలానికి వేలాడుతున్న అంధకుడికి జ్ఞానోదయమైంది. శివుడు ఆ అసురుణ్ని క్షమించి తన ప్రమథగణాల్లో చేర్చుకున్నాడు. హస్తసాముద్రికంలోనూ త్రిశూలానికి ఎంతో ప్రాధాన్యం ఉంది.

### త్రిలోచనాయ... నమశ్శివాయ..

పరమేశరున్ని చూడగానే అందరినీ ఆకర్షించేది స్వామి వారి మూడవ నేత్రం. నుదుటి భాగంలో నేత్రాన్ని ఉంచుకున్న కారణంగా శివయ్య త్రినేత్రుడయ్యాడు. సాధారణ భాషలో మూడోకన్ను అంటారు. ఈ త్రినేత్రం సాధారణ కన్నులా కనిపిస్తున్నప్పటికీ... ఇది చూసేందుకు ఉపయోగించేది కాదు. ఇది జ్ఞాన నేత్రం. సకల ద్వంద్వాలకు అతీతమైన స్థితిని ఈ నేత్రం ప్రకటిస్తుంది. ఇది ఆజ్ఞాచక్రానికి స్థానం. శివుడు మూడవ కన్ను తెరిస్తే అంతా భస్మమే అంటారు. పార్వతీ కల్యాణం విషయంలో మన్మథుడు చేసిన పనికి కోపించిన శివుడు మూడోకన్ను తెరుస్తాడు. క్షణంలో బూడిద కుప్పగా మారిపోతాడు మన్మథుడు. ఇంతటి శక్తి మూడోనేత్రానికి ఉంది. ఇక్కడ కాలిపోయింది. మన్మథుడనే వ్యక్తికాదు అరిషడ్వర్గంలో ఒకటైన కామం. ఎప్పుడైతే మనలోని అజ్ఞానం దహనమవుతుందో అప్పుడు మిగిలేది జ్ఞానమే. అటువంటి జ్ఞాననేత్రాలకు మాత్రమే పరమేశ్వరుడి దర్శనం పొందే యోగ్యత కలుగుతుంది.

### కాలరేఖ.. చంద్రరేఖ..

శివుడి సిగ మీద నెలవంక వెలుగులీనుతూ కనిపిస్తుంది. వెన్నెల అలా అర్ధ చంద్రుడిని ధరించటమే శివుడి ఔదార్యాన్ని ప్రకటిస్తుంది. దక్షప్రజాపతి అల్లుడైన చంద్రుడు తన 27 మంది భార్యల్లోనూ రోహిణి అంటేనే ఎంతో ప్రేమగా ఉండేవాడు. ఇది సహించలేని ఇతర భార్యలు తండ్రి అయిన దక్షుడికి భర్తపై ఫిర్యాదు చేస్తారు. దక్షుడు కోపంతో అల్లుడైన చంద్రుడిని శపిస్తాడు. ఆ శాపం పోగొట్టుకునే క్రమంలో శివుడి అనుగ్రహం పొందిన చంద్రుడు... ఫాలనేత్రుడి సిగ మీద అలంకారంగా నిలిచాడు. అప్పటినుంచి శివుడు చంద్రశేఖరుడయ్యాడు.

### తత్వ చింతనకు డమరుకం..

శివుడి చేతిలోని డమరుకం కేవలం వాద్యం మాత్రమేకాదు. తత్వచింతనకు అదొక వేదిక, మనం రాస్తున్న అక్షరాలకు శివయ్య చేతిలోని డమరుకమే ఉత్పత్తి స్థానమని శాస్త్రాలు చెబుతున్నాయి. ఇందుకు సంబంధించిన ఆసక్తికరమైన ఘటన ఒకటుంది. ఓసారి పరమేశ్వరుడు ఎంతో ఆనందంతో తాండవం చేస్తున్నాడట. డమరుకం వాయించటానికి ముందుగా డమరుకం మధ్యలో ఒక కొయ్య ముక్క కడతారు. దానిని మణి అంటారు. డమరుకాన్ని కదిలించినపుడు మణి డమరుకానికి అటు ఇటు తగలటం ద్వారా డమరుకం నుంచి శబ్దం ఉత్పత్తి అవుతుంది. ఆ శబ్దం అంతులేని ఆనందాన్ని కలిగిస్తుంది. ఆకాశంలో శబ్ద గుణకాలు ప్రయాణిస్తాయి. మనం ఏదైనా మంత్రాన్ని జపం చేస్తున్నా, స్తోత్రాన్ని పారాయణం చేస్తున్నా వాటి నుంచి ఏర్పడే శబ్ద ప్రకంపనలు తరంగాలుగా మారి ఆకాశానికి చేరుకుంటాయి. అనంత ఆకాశంలో సంచారం చేసే శివ డమరుక ధ్వనులతో అవి సంయోగం చెందుతాయి. ఆవిధంగా సాధకుడికి పరమేశ్వర అనుగ్రహం కలుగుతుంది.

### నాగేంద్రహారాయ..

పరమేశ్వరుణ్ని చూడగానే ఆయన మెడలో ఆభరణంగా వెలుగుతున్న వాసుకి కనిపిస్తుంది. సర్పరాజు వాసుకి తపస్సు చేసి శివుణ్ని మెప్పించి ఆయనకు కంఠహారంగా మారాడు. నిరంతరం స్వామిసేవలో తరిస్తుంటాడు. శివుడు సర్పాల్ని ధరించటం వెనుక లోతైన సందేశం దాగి ఉంది. పాములు నిరంతర జాగరూకతకు ప్రతీకలు. శివారాధకులు కూడా అంత జాగరూకతతో ఉండాలనే సందేశం ఇందులో దాగుంది. శివుడి మెడలో మూడు చుట్లు తిరిగి ఉండే సర్పం కాలచక్రానికి సంకేతం. భూత, భవిష్యత్, వర్తమాన కాలాలే ఈ మూడు చుట్టలు. ఈ మూడు కాలాలతోనే సమస్తమైన ప్రపంచ చర్య జరుగుతుంటుంది. కుండలిని శక్తి సర్పాకృతిని పోలి ఉంటుంది. పాము గర్వానికి సూచిక. తన గర్వాన్ని ఎవరైతే గెలుస్తారో వారే తనకు ఆభరణాలు అవుతారనేది సర్పాభరణాలు ధరించడం వెనుక ఉండే సందేశాల్లో ఒకటిగా గుర్తించాలి.

### నందివాహన పరమేశ్వర..

శివుడి వాహనం నంది. కేవలం వాహనం మాత్రమే కాదు... భక్తులకు శివయ్యకు మధ్య వారధి కూడా బసవయ్యే. ఆలయానికి వచ్చిన భక్తులు నంది కొమ్ముల ద్వారా శివలింగాన్ని దర్శనం చేసుకుంటారు. నంది ధర్మానికి ప్రతీక, శివుడు ఎక్కడ కొలువుంటే అక్కడ నంది ఉంటాడు. నంది లేని శివాలయం ఉండదు. అంటే శివుడు ఎక్కడ ఉంటాడో అక్కడ ధర్మం కొలువై ఉంటుందని అర్థం. నంది పశుజాతికి చెందింది. పశువు అంటే పాశంతో కట్టినదని అర్థం. మనమందరమూ పశువులమే. వివిధ రకాలైన పాశాలతో కట్టబడి ఉంటాం. ఈ పాశాలన్నీ తొలగిపోతేనే పరమేశ్వర సాక్షాత్కారం కలుగుతుంది. ఇది జరగాలంటే నందిలా నిరంతరం శివ సాన్నిధ్యంలో గడపాలి. అంటే. తనువు మనసు శివమయం కావాలి. నంది అందించే సందేశం ఇదే.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588